

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

03.09.2026
గురువారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 113
పేజీలు : 12 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## రైతులు, టీచర్లపై కేసుల్ని ఎత్తివేత
# రైతులు, టీచర్లకు ఊరట

- సీఎం విజయ్ సంచలన నిర్ణయం
- గతంలో ఆందోళనల్లో పాల్గొన్న వారిపై కేసులు
- కేసుల్ని ఎత్తేసిన విషయాన్ని గుర్తుచేసిన డీఎంకే

2లో..



# వరదలకు మీరే కారణం

- భారత్, చైనా, అమెరికాలను టార్గెట్ చేస్తున్న నేపాల్
- కర్బన ఉద్గారాలు విడుదల వల్లే వరదలు
- పరిహారం చెల్లించాలని అంతర్జాతీయంగా కోరుతున్న నేపాల్

**నేపాల్, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

నేపాల్ వరదలతో అతలాకుతలమైంది. వేయికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఇప్పుడు నేపాల్ దీనిపై రాజకీయాన్ని ప్రారంభించింది. ఘోర వరదలపై ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో పరిహారం కోరుతోంది. వరదలకు గ్రీన్ హౌజ్ ఉద్గారాలే కారణమని, ఇందులో భారత్, చైనా, అమెరికాల పాత్ర ఉందని, విపత్తు కారణంగా జరిగిన నష్టానికి క్లైమేట్ కాంపెన్సేషన్ ఇవ్వాలని నేపాల్ డిమాండ్ చేస్తోంది.

2లో..



## డీఆర్‌డీఎల్‌కు ఉచితంగా
# భూమి కేటాయించాలి

- సీఎం రేవంత్‌రెడ్డి
- ఢిల్లీలో రామ్మోహన్ నాయుడితో భేటీ
- రక్షణ మంత్రిని కోరిన సీఎం రేవంత్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు.

2లో..

## సీఈవోగా జితేంద్ర మిశ్రా

- అయోధ్య మందిరం తొలి సీఈవో
- ఆపరేషన్ సిందూర్' అధికారి

2లో..



**లక్నో, సెప్టెంబర్ 02, అనంతజనశక్తి న్యూస్**

అయోధ్య రామమందిర ట్రస్ట్ మొట్టమొదటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను ఎంపిక చేశారు. శ్రీరామ జన్మ భూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రామమందిర సీఈఓ పదవి కోసం వచ్చిన 5,585 దరఖాస్తులను వడపోసి, చివరకు జితేంద్ర మిశ్రా పేరును ఖరారు చేశారు.

# వైసీపీది విధ్వంసం

## పోలవరానికి శాపవిముక్తి: చంద్రబాబు.. వైసీపీ పాలనపై ఫైర్

- పోలవరానికి వైసీపీ శాపమైందని విమర్శ
- డయాఫ్రం వాల్ ధ్వంసానికి వైసీపీదే బాధ్యత
- నిర్వాసితులకు పైసా ఇవ్వలేదని ఆరోపణ
- ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను పట్టించుకోలేదని ధ్వజం
- రుషికొండ భవనంపై చంద్రబాబు సెటైర్
- మూడు రాజధానులపై తీవ్ర విమర్శలు
- వైసీపీది క్రెడిట్ చోరీ రాజకీయమని వ్యాఖ్య



**అమరావతి, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

ఏపీలో అన్ని నదులను అనుసంధానం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చి తెలుగుతల్లి రుణం తీర్చుకుంటామని పేర్కొన్నారు. బుధవారం ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేసి సీఎం జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఉత్తరాంధ్రకు గోదారమ్మను తీసుకువచ్చామని తెలిపారు. నదులు, వాగులు, వంకలు దాటుకుని గోదారమ్మ వచ్చిందని ప్రస్తావించారు. వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా కృష్ణమ్మను తరలించి.. కరువు పీడిత మార్కాపురానికి నీళ్లిచ్చామని ఉద్ఘాటించారు. నల్లమల కొండలను చీల్చుకుని కృష్ణమ్మ వచ్చిందని అన్నారు. ఎన్నో సమస్యలను అధిగమించి గోదావరి జలాలు తీసుకువచ్చామని తెలిపారు.

**రాష్ట్రం సుభిక్షంగా మారేలా చేస్తాం..**

పోలవరం ఎడమ కాలువ కోసం రూ.4 వేల కోట్ల ఖర్చు చేశామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం సుభిక్షంగా మారేలా చేస్తామని తెలిపారు. ఈ జల విజయం.. ప్రజల విజయమని చెప్పుకొచ్చారు. ఆధునిక దేవాలయాలు.. సాగునీటి ప్రాజెక్టులు అని అభివర్ణించారు. నీరు ఉంటేనే భద్రత, భవిష్యత్తుపై ఓ భరోసా కల్పిస్తుందని తెలిపారు. నీరు ఉంటేనే పరిశ్రమలు.. తద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయని వివరించారు. 2014లో తాము అధికారంలోకి వచ్చాక పోలవరంపై దృష్టిపెట్టామని అన్నారు. 2019 నాటికి 72 శాతం పోలవరం పనులు పూర్తిచేశామని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం.. పోలవరాన్ని పర్యవేక్షించేలా మార్చామని వెల్లడించారు. 2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చిందని.. పోలవరానికి శాపమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీ నిర్లక్ష్యం వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని ధ్వజమెత్తారు.

**మా ప్రభుత్వంలో పోలవరానికి శాపవిముక్తి..**

పోలవరం నిర్వాసితులకు గొడ్డలి పార్టీ పైసా కూడా ఇవ్వలేదని సీఎం చంద్రబాబు ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. పోలవరానికి శాపవిముక్త కలిగిందని వ్యాఖ్యానించారు. 2028 నాటికి మొత్తం 12 ప్రాజెక్టులు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయని ఉద్ఘాటించారు. ఉత్తరాంధ్రకు ఎన్నో పరిశ్రమలు తీసుకువస్తున్నామని వివరించారు. ఉత్తరాంధ్రకు కంపెనీలు వస్తుంటే.. గొడ్డలి పార్టీకి అసూయగా ఉందని దుయ్యబట్టారు. భవిష్యత్తులో ఉత్తరాంధ్రకే వలసలు వస్తారని అన్నారు. ఇకపై ఉత్తరాంధ్ర.. ఉత్తమ ఆంధ్రగా మారుతుందని నొక్కిచెప్పారు. పారిశ్రామికంగా అనకాపల్లి అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా అభివృద్ధి చేస్తామని అభిప్రాయపడ్డారు. వైసీపీ హయాంలో ఉత్తరాంధ్ర వణికిపోయిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

7లో..

## విద్యార్థులకు ఎలాంటి
# సమస్యలు ఉండవు

- ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నాం
- మంత్రి నారా లోకేష్
- మూడు హాస్టల్ భవనాలు ప్రారంభం

2లో..

**పల్నాడు, సెప్టెంబర్ 02, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం పల్నాడు జిల్లాలోని నర్సరావుపేటలో పర్యటించారు.



# 'జై కొట్టు'
## వీడియో వైరల్!

- జనసేన పార్టీ యువజన
- విభాగం గేయం ఆవిష్కరణ




7లో..

# యువత భవిత కోసం జై కొట్టాలి!

- ఇన్నాళ్లు లీడర్లు, పార్టీల కోసం జిందాబాద్ కొట్టాం
- జనసేన చీఫ్ పవన్ కల్యాణ్
- జీవితం చాలా విలువైంది
- కుటుంబం ఉందని గుర్తుపెట్టుకోండి
- అభిమానులకు పవన్ కళ్యాణ్ సూచన

2లో..



**అమరావతి, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ యువజన విభాగాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్, రాష్ట్ర ఆహార అండ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ 'జై కొట్టు' పేరుతో యువజన విభాగం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'జై కొట్టు' గేయాన్ని కూడా విడుదల చేశారు.

# రిటర్నబుల్ ప్లాట్లు కేటాయింపు

- అమరావతి రైతులకు గుడ్‌న్యూస్
- 37 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయింపు
- ఈ-లాటరీలో 17 మంది రైతులకు 37 ప్లాట్లు



2లో..

# పదవిని ఎవరూ అడ్డుకోలేరు దానికి టైమ్ రావాలి అంతే..

- రాజగోపాల్ రెడ్డి
- పార్టీని కబ్జా చేయాలని చూస్తే ఊరుకోబోం
- వైఎస్సార్ ఆశయాల కోసం పనిచేస్తానని వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 02, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలురాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో మరోసారి కలకలం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను పరోక్షంగా వ్యక్తం చేస్తూ.. సమయం వచ్చినప్పుడు తనను ఎవరూ ఆపలేరని ఆయన వ్యాఖ్యానించారు.

2లో..

# నాన్నా.. మిమ్మల్ని ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను

- వైఎస్ జగన్ భావోద్వేగ ట్వీట్!
- వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి
- ఎప్పటికీ స్ఫూర్తిగానే ఉంటారని వెల్లడి



**అమరావతి, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్**

దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నేడు. ఈ సందర్భంగా ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రిని స్మరించుకుంటూ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో భావోద్వేగ సందేశాన్ని పోస్టు చేశారు. వైఎస్సార్ తనకు ఎప్పటికీ స్ఫూర్తిగానే ఉంటారని, ఆయన జ్ఞాపకాలు ఎల్లప్పుడూ తనతోనే ఉంటాయని పేర్కొన్నారు.

2లో..

## బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారు

కాళేశ్వరంలో కుట్ర జరిగితే అప్పుడెందుకు కేసు పెట్టలేదు
మాజీ మంత్రి కడియం శ్రీహరి
రెచ్చిపోయి పది పడితే అది మాట్లాడుతున్నారు



2లో..

# రైతులు, టీచర్లపై కేసుల్ని ఎత్తివేత

## రైతులు, టీచర్లకు ఊరట

చెన్నై, సెప్టెంబర్ 02, అనంతజనశక్తి న్యూస్

తమిళనాడు సీఎం విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతులు, ఉపాధ్యాయులపై ఉన్న కేసుల్ని ఎత్తేశారు. జీవనోపాధి, హక్కులు, న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా చేపట్టిన ఆందోళనలకు సంబంధించి 2021 మే నుంచి 2026 ఏప్రిల్ మధ్య నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బుధవారం అసెంబ్లీలో ప్రకటించారు. మానవతా దృక్పథంతో పాటు ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.
గత ప్రభుత్వం రైతులు, టీచర్లపై అనేక కేసులు నమోదు చేసిందని విజయ్ విమర్శించారు. వారి ప్రజాస్వామ్య హక్కులు హరించబడ్డాయని, కేసుల కారణంగా ఇప్పటికే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు, టీచర్ల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తిరువణ్ణామలై జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్‌కు వ్యతిరేకంగా రైతులు నిర్వహించిన ఆందోళనల్ని విజయ్ ప్రశ్నించారు. ఈ నిరసనల్లో కొందరు రైతులపై గుండాస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారని చెప్పారు.
పరందూర్‌లో ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా రైతులు చేసిన ఆందోళనల కేసులను కూడా ఉపసంహరిస్తామని విజయ్ ప్రకటించారు. విమానాశ్రయం కారణంగా వ్యవసాయ భూములు, నీటి వనరులు, జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ కేసుల ఉపసంహరణ ప్రజాస్వామ్య హక్కులపై మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలుకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకాన్ని పెంచుతుందని విజయ్ అన్నారు.
అయితే, విజయ్ చర్యపై డీఎంకే స్పందించింది. రైతులపై కేసులు విత్ డ్రా చేసుకోవడం ఇదే తొలిసారి కాదని, తమ డీఎంకే ప్రభుత్వ హాయంలో నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన 5000కు పైగా కేసుల్ని ఉపసంహరించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. CAA, మూడు వ్యవసాయ చట్టాలు, కుడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న వారిపై నమోదైన కేసులను తమ ప్రభుత్వం ఉపసంహరించిందని స్టాలిన్ పేర్కొన్నారు.

# రిటర్నబుల్ ప్లాట్లు కేటాయింపు

అమరావతి, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్

నవ్యాంధ్ర రాజధాని అమరావతి ప్రాంత రైతులకు గుడ్‌న్యూస్ చెప్పింది కూటమి ప్రభుత్వం.. అమరావతి ప్రాంత రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఈలాటరీ విధానంలో 17 మంది రైతులకు మొత్తం 37 ప్లాట్లను కేటాయించారు. ఇందులో 24 రెసిడెన్షియల్ ప్లాట్లు, 13 కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయి. నెక్కల్లు, తుళ్లూరు, శాఖమూరు, కొండమరాజుపాలెం, లింగాయపాలెం గ్రామాలకు చెందిన రైతులకు ఈ ప్లాట్లను అధికారులు కేటాయించారు. గతంలో కేటాయించిన ప్లాట్ల విషయంలో వీధిపోటు, కోర్టు కేసులు, భూసేకరణ వంటి సమస్యలు తలెత్తడంతో ఆయా రైతులకు ప్రత్యామ్నాయంగా కొత్త రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈలాటరీ విధానం ద్వారా పారదర్శకంగా ప్లాట్ల కేటాయింపు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. సమస్యల కారణంగా పాత ప్లాట్లను వినియోగించుకోలేని రైతులకు కొత్త ప్లాట్లు కేటాయించడంతో వారి ప్రయోజనాలు కాపాడినట్లయింది.

# వరదలకు మీరే కారణం

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 26న భోటేకోషి నదీ పరివాహక ప్రాంతంలో సంభవించిన భారీ వరదలతో రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది. ఇళ్లు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. నేపాల్ ప్రభుత్వం ఈ విపత్తును 'హిమాలయన్ సునామీ'గా అభివర్ణించింది.
ఈ వరదల్లో ఇప్పటివరకు 1,127 మంది మరణించగా.. మరో 3,900 మంది ఆచూకీ గల్లంతయ్యారు. నేపాల్, చైనా సరిహద్దుల సమీపంలో కొండరాళ్లు విరిగి పడి వరదలకు కారణమైందని నిపుణులు భావిస్తున్నారు. ఈ విపత్తుపై నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల వల్ల ఎక్కువగా నష్టపోతున్న దేశాలకు, కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్న దేశాలు పరిహారం చెల్లించాలని కోరారు. వరదల నష్టాన్ని కేవలం మానవతా సంక్షోభంగా చూడకుండా, వాతావరణ న్యాయం, పరిహారం కోణంలో చూడాలని నేపాల్ కోరుతోంది. ఇది దాతృత్వం కాదని, చట్టపరమైన, నైతిక బాధ్యత అని నేపాల్ తన వాదనని అంతర్జాతీయ స్థాయిలో వినిస్తోంది.
ప్రస్తుతం ప్రపంచంలో గ్రీన్ హౌజ్ ఉద్గారాలు విడుదల చేస్తున్న దేశాల్లో చైనా, అమెరికా, భారత్ అగ్రస్థానాల్లో ఉన్నాయని నేపాల్ వాదిస్తోంది. అయితే, తలసరి ఉద్గారాల విషయంలో భారత అభివృద్ధి చెందిన దేశాల కంటే చాలా తక్కువ స్థాయిలో ఉంది. వరదల నష్టాలపై తమ వాదనల్ని వినిపించేందుకు నేపాల్ ప్రధాని బాలెన్ షా ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశాల్లో పాల్గొనే అవకాశం ఉంది. వరదల వల్ల జరిగిన నష్టం, పునరావాసం, పునర్నిర్మాణం కోసం నేపాల్ ఐక్యరాజ్యసమితి మద్దతుతో పనిచేస్తున్న 'ఫండ్ ఫర్ రెస్పాండింగ్ టు లాస్ అండ్ డ్యామేజ్'కు అధికారికంగా అభ్యర్థన పంపింది.

# పదవిని ఎవరూ అడ్డుకోలేరు

**– దానికి టైమ్ రావాలి అంతే..**

(మొదటి పేజీ తరువాయి)

తనకు పదవులపై వ్యక్తిగత ఆశ లేదని చెబుతూనే రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.సమయం వచ్చినప్పుడు దేవుడి దయతో వచ్చే పదవులను ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. తాను భవిష్యత్తులో ముఖ్యమంత్రి అవుతాననే ధీమాను వ్యక్తం చేసిన ఆయన.. ఆ సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా తనను ఆపలేడని వ్యాఖ్యానించారు. తనకు ఏ పదవి వచ్చినా అది వ్యక్తిగత గౌరవంగా భావించబోనని.. సామాన్యుడికి దక్కిన బాధ్యతగా భావిస్తానని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. పేద ప్రజలకు సేవ చేయడమే తన రాజకీయ లక్ష్యమని పేర్కొన్నారు. పదవిని కిరీటంగా కాకుండా బాధ్యతగా భావిస్తానన్నారు.ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరుతున్న నాయకులపై కూడా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నుంచి నాయకులను ఆహ్వానించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని పేర్కొంటూనే.. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్న అసలు కార్యకర్తలను పక్కనబెట్టి పార్టీని తమ ఆధీనంలోకి తీసుకోవాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. మా ఇంట్లోకి వచ్చి మమ్మల్నే వెళ్లగొడతామంటే బాగుండదు అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి అధికారం రావడం కోసం 10 ఏళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అసలు కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌ను కొందరు తమ ఆధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని సంచలన ఆరోపణలు గుప్పించిన రాజగోపాల్‌రెడ్డి.. తాను ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీని ఎవరూ కబ్జా చేయలేరని తేల్చి చెప్పారు. మునుగోడులోనే కాకుండా తెలంగాణలోని అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని.. వారికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు. తాను ప్రజా సమస్యలపైనే పోరాడుతున్నానని, పదవుల కోసం కాదని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనకు రాజకీయ స్ఫూర్తి అని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో వైఎస్ఆర్‌కు ఇప్పటికీ లక్షలాది మంది అభిమానులు ఉన్నారని గుర్తు చేశారు. వైఎస్ఆర్ ఆశయాల కోసం పనిచేస్తానని.. ఆయన పాలనలో పేదలకు అందిన సంక్షేమం, అభివృద్ధిని ప్రస్తావిస్తూ.. మళ్లీ రాజశేఖర్‌రెడ్డి యుగం రావాలని ఆకాంక్షించారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలన్నదే తన ఆలోచన అని చెప్పారు. ఇచ్చిన హామీల అమలు, అవినీతికి వ్యతిరేకంగా, పేదలకు అండగా ఉండేందుకు తాను పోరాడతానన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

# నాన్నా.. మిమ్మల్ని ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను

(మొదటి పేజీ తరువాయి)



'నాన్నా.. మిమ్మల్ని ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను. మీరు ఎప్పటికీ నా స్ఫూర్తి. మీ జ్ఞాపకాలు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయి' అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. తండ్రిపై తనకున్న అనుబంధాన్ని, అభిమానాన్ని మరోసారి వ్యక్తం చేశారు. అంతకుముందు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఉదయం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద జగన్ నివాళులు అర్పించారు. తండ్రి సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్ కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు. వైఎస్సార్ చేసిన సేవలను, ఆయన పాలనలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేసుకుంటున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 2009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2న ఆయన వర్ధంతిని కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు.

# యువత భవిత కోసం జై కొట్టాలి!




(మొదటి పేజీ తరువాయి)

యువజన విభాగం ఆవిర్భావాన్ని పురస్కరించుకుని జనసేనాని పవన్ కళ్యాణ్ ఆడియో సందేశాన్ని పంపించారు. యువత రాజకీయ, సామాజిక మార్పులో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కేవలం నాయకులు, రాజకీయ పార్టీల కోసం నినాదాలు చేయడం కాకుండా.. సమాజం, యువత భవిష్యత్తు, మార్పు కోసం పనిచేసే దిశగా ముందుకు సాగాలని సూచించారు. 'దేహీ అని దేనికోసం చేతులు చాపవద్దు.. దేశం కోసం పని చేసే చేతులు కావాలి' అంటూ యువతలో సేవాభావం, స్వావలంబన పెరగాలని ఆకాంక్షించారు. 'నేను ఎక్కడ ఉన్నాను అని ప్రశ్నార్థకం వద్దు.. ఇక్కడే ఉన్నాను అని అస్తిత్వం పిడికిలి కావాలి' అని పేర్కొన్నారు.
ఇన్నాళ్లూ నాయకులు, రాజకీయ పార్టీల కోసం నినాదాలు చేశామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇకపై యువత కోసం, వారి భవిత కోసం, మార్పు కోసం, ప్రజల తీర్పు కోసం 'జై కొట్టు' అని నినదించాలని పిలుపునిచ్చారు. పట్టు వదలని ప్రజల కోసం పోరాడే సేనకు జై కొట్టాలని, సమాజంలో మార్పు కోసం యువత ముందుండాలని ఆకాంక్షించారు. యువతలో రాజకీయ చైతన్యంతో పాటు బాధ్యత, సేవా దృక్పథం పెంపొందించాలని తన సందేశం ద్వారా స్పష్టం చేశారు.
పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పిఠాపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన శ్రేణులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'జై కొట్టు' లోగో, గేయం ఆవిష్కరణతో పార్టీ యువజన విభాగానికి అధికారికంగా కొత్త రూపం లభించింది. యువతను మరింతగా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై స్పందించేలా, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా 'జై కొట్టు'ను ఉపయోగించుకోవాలని జనసేన భావిస్తోంది.
ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. కోనసీమ జిల్లా అమలాపురం సమీపంలోపవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తూ..కరెంట్ షాక్ కొట్టి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. అల్లవరం మండలంలోని ఓడలరేవులో ఈ ఘటన చోటుచేసుకుంది. బెండమూర్లంకకు చెందిన ప్రేమ్ కుమార్ అనే 23 ఏళ్ల యువకుడు ఓడలరేవులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. అనంతపురంలోని పెనుగొండలో ఉన్న కియా కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. అయితే తన అభిమాన హీరో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు స్వగ్రామం వచ్చిన ప్రేమ్ కుమార్.. మంగళవారం రాత్రి వేళ ఫ్లెక్స్ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. చుట్టుపక్కల వారు వెంటనే అతణ్ని ఆస్పత్రికి తరలించగా.. ప్రేమ్ కుమార్ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం ప్రేమ్ కుమార్ మృతదేహాన్ని అమలాపురం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన పవన్ కళ్యాణ్ అభిమానుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

**అమలాపురం ఘటన.. కలిచివేసిందన్న పవన్ కళ్యాణ్..**

మరోవైపు అమలాపురం ఘటన కలిచివేసిందని పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ.. ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్‌కు గురై రోళ్ల ప్రేమ్ కుమార్ ప్రాణాలు కోల్పోవడం కలచివేసిందని ట్వీట్ చేశారు. ప్రేమ్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని.. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రేమ్ కుమార్ కుటుంబానికి అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. జీవితం ఎంతో అమూల్యమైనదని.. వేడుకలు, ఉత్సవాల సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే సమయంలో కుటుంబం ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఎత్తైన ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసే సమయంలో, ర్యాలీల్లో స్వీయ భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ జాగ్రత్తగా, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

**నిర్మాత ఎస్‌కేఎన్ ఆర్థిక సాయం..**

మరోవైపు పవన్ కళ్యాణ్ అభిమాని మృతిపై నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించారు. రూ.2 లక్షలు పరిహారం ప్రకటించారు. తాను కూడా ఒకప్పుడు బ్యానర్లు కడుతూ, అభిమానిగా మొదలుపెట్టి ఈ స్థాయికి చేరుకున్నాన్న ఎస్కేఎన్.. ఒక అభిమాని బాధ ఎలా ఉంటుందో తనకు తెలుసన్నారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజున ఆయన అభిమాని ప్రేమ్ కుమార్.. ఇలా దూరం కావటం బాధ కలిగించిందని ట్వీట్ చేశారు. ప్రేమ్ కుమార్ కుటుంబానికి ఓ అభిమానిగా, ఒక మనిషిగా అండగా నిలబడాలని నిర్ణయించుకున్నానని.. వారి బాధను తీర్చలేకపోయినా, తన వంతుగా రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎస్‌కేఎన్ ప్రకటించారు.

# డీఆర్‌డీఎల్‌కు ఉచితంగా భూమి కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని కోరారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు.
ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు..సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.
హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో బిజీ బిజీగా గడుపుతున్నారు. ఓవైపు కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు చూసుకుంటూనే, మరోవైపు..కేంద్రమంత్రులతో సమావేశం అవుతున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న రక్షణ ప్రాజెక్టుకు భూమి కేటాయింపు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు, అలాగే హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026, రక్షణ ఎక్స్‌పో2026పై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో చర్చించారు.
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు హాజరు కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు.
రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సులతో పాటు ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, అత్యాధునిక భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశవ్యాప్తంగా రక్షణ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రక్షణ ఎక్స్‌పోను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు కేంద్ర రక్షణశాఖ సహకారం అందించాలని కోరారు. ఎయిర్‌షోకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు సహకరించాలని.. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ఎక్స్‌పోలో ప్రదర్శించాలని కోరారు. త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగ సంస్థలతో పాటు డీఆర్‌డీవోకు చెందిన ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ డిఫెన్స్ టెక్నాలజీని ప్రదర్శించేలా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరించాలని కోరారు. మరోవైపు.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుపైనా సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చించారు. ఈ ప్రాజెక్టు కోసం 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఇప్పటికే అంగీకరించిందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల పాటు కేటాయించే ప్రతిపాదన ఉందని తెలిపారు. అవసరమైతే మరో 2 సార్లు లీజును పొడిగించుకునే అవకాశం కూడా ఉంటుందని వివరించారు.

# సీఈవోగా జితేంద్ర మిశ్రా



(మొదటి పేజీ తరువాయి)

వైమానిక దళంలో మిశ్రా 39 ఏళ్ల పాటు సేవలందించారు. ట్రస్ట్ ఛైర్మన్ నృత్య గోపాల్‌దాస్ నివాసంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీఈఓ ఎంపిక కమిటీ తుది నివేదికను సమర్పించింది. ముగ్గురు పేర్లను ప్రతిపాదించగా.. చివరకు జితేంద్ర మిశ్రా సీఈఓగా ఖరారు చేశారు.
జితేంద్ర మిశ్రా భారత వైమానిక దళంలో అనేక ఉన్నత పదవులను నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో వెస్ట్రన్ కమాండ్‌కు చీఫ్‌గా వ్యవహరించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మిశ్రా పదవీవిరమణ చేశారు. అయోధ్య రామమందిరంలో విరాళాల చోరీ ఆరోపణల నేపథ్యంలో సీఈఓగా ఎంపికైన ఆయనపై రామమందిర నిర్వహణ, ఆర్థిక జవాబుదారీతనాన్ని పటిష్టం చేసే బృహత్తరమైన బాధ్యత ఉంటుంది.
ఆపరేషన్ సింధూర్ సమయంలో ఆయన చేసిన విశిష్ట సేవకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సర్వోత్తమ్ యుద్ధ సేవా పతకాన్ని ప్రదానం చేశారు. యుద్ధం, వివాదం లేదా సైనిక సంఘర్షణల సమయంలో అత్యున్నత స్థాయి విశిష్ట సేవలకు ఈ పతకాన్ని అందజేస్తారు. ఇది భారతదేశంలోని అత్యంత అరుదైన సైనిక పురస్కారాలలో ఒకటి. మిశ్రా నియామకం ద్వారా కార్యాచరణ ప్రణాళిక, సమన్వయం, లాజిస్టిక్స్, భారీ విభాగాలు/ బలగాల నిర్వహణలో విస్తారమైన అనుభవం ఉన్న ఒక సీనియర్ నాయకుడి సేవలు ఈ ట్రస్ట్‌కు లభించనున్నాయి.
ఇటీవల ఒక పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మిశ్రా ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగిన వైమానిక దాడుల గురించి మాట్లాడారు. పాకిస్థాన్ భూభాగంలోపలికి భారత దళాలు చొచ్చుకెళ్లి, లక్ష్యాలపై ఎలా దాడిచేశాయో వివరించారు. 'షూట్' (కాల్చండి) అనే చిన్న కార్యాచరణ ఆదేశం వచ్చిన వెంటనే, సుమారు 314 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక లక్ష్యాన్ని ఎలా ధ్వంసం చేశారో ఆయన తెలిపారు. ఈ ఆపరేషన్ గురించి వివరించిన ఆయన.. పక్కా ప్రణాళిక, ఖచ్చితత్వం, సాంకేతికత, సాయుధ దళాలలోని వివిధ విభాగాల మధ్య సమన్వయం ప్రాముఖ్యతను విశ్లేషించారు. అయితే, ఈ ఆపరేషన్‌కు సంబంధించిన కొన్ని కీలక వివరాలు ఇప్పటికీ రహస్యంగానే ఉన్నాయి.
ఇక, జితేంద్ర మిశ్రా ఉత్తర్‌ప్రదేశ్‌లోని దేవరియా జిల్లాలోని భోపత్‌పురా గ్రామానికి చెందిన సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి లెక్చరర్‌గా పనిచేశారు. రామమందిర సీఈఓగా మిశ్రా రోజువారీ పరిపాలన, యాత్రికుల సౌకర్యాలు, ఆర్థిక ఏర్పాట్లు, సిబ్బంది సమన్వయం, భద్రతాపరమైన పర్యవేక్షణ, పెద్ద ఎత్తు దార్మిక వేడుకల నిర్వహణ బాధ్యతలను చూసుకునే అవకాశం ఉంది.

# బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారు

హైదరాబాద్, సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్

బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో, అహంకారంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందని ఆరోపించారు. బుధవారం లింగాల గణపురంలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారని రెచ్చిపోయి ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు తెలంగాణ మీద పడి లక్షల కోట్లు దోచుకున్నారని.. స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పిందని ప్రస్తావించారు.

**కవిత లేవనెత్తిన అంశాలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి..**

దోచుకున్న సొత్తును లెక్క పెట్టేందుకు వారికి సమయం సరిపోవడం లేదని కవిత చెప్పారని కడియం శ్రీహరి అన్నారు. ఎక్కడో పంపకాల్లో తేడా రావడంతో ఇప్పుడు ఆమె బయటకు వచ్చి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులకు సిగ్గు ఉంటే తమ మీద విమర్శలు, వ్యతిరేకంగా నిరసనలు చేయడం కాదని.. కవిత లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం లోని ప్రధాన మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు అప్పుడే కుంగిపోయాయని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కుట్ర జరిగిందనే అనుమానం ఉంటే అప్పుడెందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు.

**ప్రభుత్వ సొమ్మును కేసీఆర్ దుర్వినియోగం చేశారు..**

కాళేశ్వరం నుంచి చుక్క నీటిని ఉపయోగించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అత్యధిక పంట దిగుబడి సాధించిందని కడియం శ్రీహరి తెలిపారు. కేసీఆర్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బంగారు కుటుంబం అయ్యిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఎక్కడా కూడా తెలంగాణ ప్రజలు బాగుపడలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందో బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని కడియం శ్రీహరి ప్రశ్నించారు.

# విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉండవు

(మొదటి పేజీ తరువాయి)



నర్సరావుపేట మండలం కాకాని గ్రామంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాకినాడ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నూతనంగా నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను మంత్రి ప్రారంభించారు. నర్సరావుపేట జేఎన్‌టీయూకే కాలేజీలో నూతన హాస్టళ్ల ప్రారంభంతో విద్యార్థులకు వసతి సమస్యలు మరింత తగ్గనున్నాయని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నిర్మించిన గదులు, ఇతర మౌలిక సదుపాయాలపై మంత్రి లోకేశ్.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.
మొత్తం 1,600 మంది విద్యార్థినీ, విద్యార్థులకు వసతి కల్పించేలా హాస్టళ్లను ప్రభుత్వం రూపొందించింది. గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన ఈ మూడు హాస్టల్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.70 కోట్లను ఖర్చు చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్‌టీయూకే వైస్ ఛాన్స్‌లర్ సీఎస్ఆర్కే ప్రసాద్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, మంత్రి గొట్టిపాటి రవికుమార్, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
ఆ తర్వాత హాస్టల్ మొత్తం కలియతిరిగి వసతులను మంత్రి లోకేశ్ పరిశీలించారు. అనంతరం రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ, విద్యార్థులకు అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన వసతి గృహాలను మంత్రి లోకేశ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. ముందుగా కళాశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రికి కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. విద్యార్థినీ, విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ భవనాలను అత్యాధునిక సదుపాయాలతో ఏపీ ప్రభుత్వం నిర్మించింది.

గురువారం | అనంతపురం
03.09.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# 'కాక్రోచ్'లపై కేసులన్నీ కొట్టివేత..

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జులై 2025 మధ్య దేశంలో వేర్వేరుచోట్ల జరిగిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో దేశ రాజధానిలో ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజు జరపతలపెట్టిన ర్యాలీని విరమించుకుంటున్నట్లు సీజేపీ ప్రకటించింది. నిరసనలతో ముడిపడిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాల్సిందిగా కేంద్రంతోపాటు మహారాష్ట్ర, అస్సాం, బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు కోరుతున్నాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మంగళవారం తెలిపారు. దీంతో సీజేఐ తన నిర్ణయాన్ని ప్రకటించడంతోపాటు.. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఉదంతంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం చెల్లించాలని, దానికోసం దేశవ్యాప్త విధానాన్ని రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించారు. ''యువ నిరసనకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, వారిపై న్యాయచర్యను ముగిస్తున్నాం. సంపూర్ణ న్యాయం






చేయడానికి 142వ అధికరణం ద్వారా రాజ్యాంగం మాకు ఇచ్చిన అసాధారణ అధికారాన్ని వినియోగిస్తున్నాం'' అని ప్రకటించారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనల్లో పాల్గొన్నవారిలో తీవ్ర నేరాభియోగాల చరిత్ర ఉన్న 2,873 మందిపై మాత్రం కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి కేంద్ర అభ్యర్థన మేరకు దిల్లీ పోలీసులను అనుమతిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. భౌతిక దాడికి, ఆస్తుల విధ్వంసానికి పాల్పడేవారిపై కేసులు నమోదు చేయవచ్చని స్పష్టంచేసింది. జులై 2025 మధ్య సీజేపీ నిరసనలకు సంబంధించి వేరే ఏ రాష్ట్రంలోనైనా కేసులు నమోదైతే అవి సుప్రీంకోర్టు ముందు లేకపోయినా వాటినీ మూసివేసినట్లు పరిగణించాలని తేల్చిచెప్పింది.

ఆందోళనను రద్దు చేసుకుంటున్నట్లు కోర్టులో ప్రకటన ధర్మాసనం ముందు సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ హాజరై ప్రభుత్వానికి, సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. 5న జరపతలపెట్టిన తమ ఆందోళనను విరమించుకుంటున్నట్లు ప్రకటనను చదివి వినిపించారు. కోర్టు తీర్పు పూర్తిస్థాయిలో అమలవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉభయపక్షాల ప్రకటనల్ని కోర్టు నమోదు చేసుకుంది. అవి తమ వాగ్దానానికి కట్టుబడి ఉంటాయని ఆశాభావం వ్యక్తంచేసింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మహారాష్ట్రలో స్పందిస్తూ తమకు పరిపూర్ణంగా న్యాయం జరిగిందన్నారు. పోరాటంలో పాల్గొన్నవారికి, ఆత్మహత్యలతో ప్రాణాలు తీసుకున్నవారి కుటుంబాలకు న్యాయం చేసినందుకు కోర్టుకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీలతో ఇకపై ఏ విద్యార్థీ ప్రాణాలు కోల్పోకుండా ప్రభుత్వం చూడాలన్నారు. యువత సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, దానిలో భాగంగానే వారికిచ్చిన మాట ప్రకారం కేసులను ఉపసంహరించుకున్నామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా తెలిపారు.

## మమతా బెనర్జీ మేనకోడలు అనుమానాస్పద మృతి



బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనకోడలు బృష్టి ముఖర్జీ ఘటక్ (28) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. రాంపూర్‌హట్‌లోని తమ నివాసంలో మంగళవారం మధ్యాహ్నం ఉరి వేసుకున్నారు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా..అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బృష్టి ముఖర్జీ కుల కేసు విచారణ దశలో ఉందని కుటుంబసభ్యులు వెల్లడించారు. దీంతో కొంత కాలంగా ఆమె డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. మమతా బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. బృష్టి కూడా అక్రమంగా ఉద్యోగం పొందారని ఆరోపణలు వచ్చాయి. ఆ నియామకాలను సుప్రీం కోర్టు రద్దు చేయడంతో ఆమె ఉద్యోగం కోల్పోయారు.

## "వైద్యులపై దాడికి పాల్పడినవారికి బెయిలు బంద్": సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



**వైద్య వృత్తిలో ఉంటూ రోగులకు సేవలు అందించే ఆరోగ్య సంరక్షణ సిబ్బందిపై దాడులకు తెగబడేవారి పట్ల న్యాయస్థానాలు ఎలాంటి ఉపేక్ష వహించబోవని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. వైద్య సేవలు అందించే వారి పట్ల కనీస గౌరవం, మర్యాద చూపని వ్యక్తులకు బెయిలు పొందే అర్హత ఎంతమాత్రమూ ఉండదని సుప్రీంకోర్టు అత్యంత ఘాటుగా స్పష్టం చేసింది. సమాజానికి రక్షణగా నిలిచే వైద్యులపై భౌతిక దాడులు చేసే సంస్కృతిని తీవ్రంగా పరిగణించాల్సిందేనని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. బాంబే హైకోర్టు గతంలో జారీ చేసిన వివిధ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు సమగ్ర విచారణ జరిపి ఈ సంచలన తీర్పును ఇచ్చింది.**

**అసలేం జరిగిందంటే..?**

**మహారాష్ట్రలోని ఠాణె మున్సిపల్ ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు వైద్య సిబ్బందిపై శివసేన కార్పొరేటర్ రమేశ్ మాత్రే, అతడి అనుచరులు దౌర్జన్యానికి దిగారు. ఈ వికృత దాడికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో బాంబే హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ కేసుకు సంబంధించి స్థానిక ట్రయల్ కోర్టు నిందితుడు రమేశ్ మాత్రేకు మంజూరు చేసిన బెయిలును జులై 18వ తేదీన బాంబే హైకోర్టు తక్షణమే సస్పెండ్ చేసింది. అంతేకాకుండా నిందితుడైన కార్పొరేటర్ పోలీసుల ఎదుట వెంటనే లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది.**

**సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం కఠిన వైఖరి**

**ఆ తర్వాత ఆగస్టు 7వ తేదీన బాంబే హైకోర్టు రమేశ్ మాత్రేతో పాటు ఇతర నిందితులకు కొన్ని అత్యంత కఠినమైన నిబంధనలతో బెయిలు మంజూరు చేసింది. అయితే హైకోర్టు విధించిన ఆ కఠిన షరతులను నిందితుడు మాత్రే అంగీకరించకుండా సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. మరోవైపు హైకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించడాన్ని, ట్రయల్ కోర్టు ఇచ్చే బెయిలుపై స్టే విధించడాన్ని కూడా అతడు సుప్రీంలో ప్రశ్నించాడు.**

**ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతూ.. బాంబే హైకోర్టు తీసుకున్న నిర్ణయం పూర్తిగా సమర్థనీయమైనదని కొట్టిపారేసింది. మహిళా డాక్టర్‌తో సహా పలువురు వైద్యులపై బహిరంగంగా దాడికి పాల్పడటం**

**దారుణమైన చర్య అని పేర్కొంది. ఇలాంటి తీవ్రమైన కేసుల్లో నిందితుల పట్ల ఎలాంటి మెతక వైఖరి అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించిన తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 7వ తేదీకి వాయిదా**

**వేసింది.**

## అమెరికాలో లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేసి కుటుంబం కోసం ఇండియాకు వచ్చేసిన భారతీయ యువతి




అమెరికాలో ఉన్నత విద్య, తర్వాత మంచి జీతంతో ఉద్యోగం. ఇది ప్రపంచంలో చాలా మంది యువత కనే కల. కానీ, ఓ యువతి మాత్రం ఆరంకెల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేసి, ఇండియాకు వచ్చేసింది. అక్కడ జీతం, విలాసవంతమైన జీవితం ఉన్నా.. సాయంత్రమైతే పలకరించేవారు ఉండరని, ఈ రోజు ఎలా గడిచింది? అని అడిగే వ్యక్తి కనపించరని అది తనను ఎంతో వేదనకు గురిచేసిందని ఆమె అన్నారు. అందుకే సొంత దేశం వచ్చేయాలని నిర్ణయించుకున్నానని ఆమె వివరించారు. ఆమె గురుగ్రామ్‌కు చెందిన దిశ లంబ.

అమెరికాలో ఆరంకెల జీతం వచ్చే ఉద్యోగం, లాటరీలో లభించిన హెచ్ 1బీ (H1B) వీసా.. వీటన్నింటినీ వదులుకుని కుటుంబం కోసం ఓ భారతీయ యువతి స్వదేశానికి తిరిగొచ్చేశారు. కేవలం కుటుంబానికి దగ్గరగా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు గురుగ్రామ్‌కు చెందిన 28 ఏళ్ల దిశా లంబా వెల్లడించారు. ఉన్నత విద్య కోసం 2021లో అమెరికాకు వెళ్లిన ఆమె.. న్యూయార్క్ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. అనంతరం 'సీవీఎస్ హెల్త్' (CVS Health) సంస్థలో డేటా సైంటిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టారు. 'బిజినెస్ ఇన్‌సైడర్'తో మాట్లాడిన లంబా.. అమెరికాలో ఉండటం వల్ల తాను ఎంతో స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో మారగలిగానని చెప్పారు. అయితే, ఆ స్వేచ్ఛ వెనుక మాటల్లో చెప్పలేని ఒక వేదన ఉందన్నారు. ''అమెరికాలో నాకు అద్భుతమైన జీవితం ఉంది. కానీ కుటుంబానికి దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతో మే 2026లో భారత్‌కు తిరిగిరావాలని నిర్ణయించుకున్నాను.. అలాగే హెచ్ 1బీ వీసాలపై ఆంక్షలు నాకు నచ్చలేదు'' అని లంబా తెలిపారు.

**అమెరికా నుంచి స్వదేశానికి**

''నేను ఇండియాలో పుట్టి పెరిగాను.. నేను ఇంట్రోవర్ట్ కావడం వల్ల కంఫర్ట్‌గా ఉండే చోట ఉండటానికే ఇష్టపడేదాన్ని.. కానీ మా నాన్న నన్ను మాస్టర్స్ చదువు కోసం అమెరికాకు పంపించాలని కలలు కనేవారు... ఆయన స్నేహితుల పిల్లలు అమెరికా, యూకేలకు వెళ్లి ఉన్నతంగా ఎదిగారు.. నేను కూడా అలాగే కావాలని కోరుకున్నారు'' అని ఆమె చెప్పారు. ''పనిచేసే సంస్థ నా H1B వీసాకు స్పాన్సర్ చేసింది.. నేను మార్చి 2026లో లాటరీలో ఎంపికయ్యానని నాకు తెలియజేశారు. అయితే, చివరికి భారతదేశానికి తిరిగి రావాలనేది నా ప్రణాళిక, ఆ సమయానికే నేను ఆ నిర్ణయం తీసుకున్నాను'' అని ఆమె అన్నారు. ''సాయంత్రం 5 కాగానే రోజు ఎలా గడిచింది అని అడిగేందుకు పక్కన ఎవరూ ఉండేవారు కారు. నాకు స్నేహితులు ఉన్నారు, కానీ స్నేహితులు ఎప్పటికీ కుటుంబం కాలేరు. నా బెస్ట్ ఫ్రెండ్ అయిన మా అమ్మతో మాట్లాడటానికి టైమ్ జోన్ తేడాల ప్రకారం వీడియో కాల్స్ ప్లాన్ చేసుకోవాల్సి వచ్చేది'' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్ 1బీ వీసా వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ, దాని ఆంక్షలు తనకు నచ్చలేదని లంబా అన్నారు. హెచ్ 1బీ వీసాపై ఉంటే వేరే కంపెనీకి మారడం, అదనపు ఆదాయ మార్గాలను వెతుక్కోవడం లేదా కెరీర్‌లో చిన్న విరామం తీసుకోవడం చాలా కష్టమని ఆమె తెలిపారు. ''ఒక్కసారి హెచ్ 1బీ వీసా వచ్చిందంటే అమెరికా దాటి వెళ్లి మళ్లీ రావడానికి కొత్త వీసా స్టాంపింగ్ అవసరం. భారత్‌లో స్టాంపింగ్ అపాయింట్‌మెంట్ పొందడం పెద్ద ప్రహసనం. సాధారణంగా హెచ్ 1బీ వీసాను దశల వారీగా ఇస్తారు కాబట్టి, నిరంతరం వీసా వ్యవహారాలను మేనేజ్ చేసుకోవాల్సి వస్తుందని అనిపించింది'' అని ఆమె వివరించారు. ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత గురుగ్రామ్ చేరుకుని, ప్రస్తుతం తన తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి ఉంటున్నారు. ఉపాధి వీసా నిబంధనలు లేకపోవడం వల్ల లభించిన స్వేచ్ఛతో ఆమె రెండు నెలల కెరీర్ బ్రేక్ తీసుకున్నారు. ప్రస్తుతానికి చేతిలో ఎలాంటి ఆఫర్ లేకపోయినప్పటికీ, అమెరికాకు సమానమైన కెరీర్ అవకాశాలు భారత్‌లో కూడా ఉన్నాయని లంబా స్పష్టం చేశారు.

**హెచ్-1బీ వీసా జారీలో కఠిన నిబంధనలు**

**గత నెలలో అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ (DHS) హెచ్-1బీ వీసా ఫీజును 1,03,265 డాలర్లుకి పెంచాలని ప్రతిపాదించింది. ఒకవేళ ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే.. అమెరికాలోని విదేశీయులకు ముఖ్యంగా హెచ్-1బీ వీసా లబ్ధిదారులలో 70 శాతానికి పైగా ఉన్న భారతీయులకు ఖర్చులు విపరీతంగా పెరుగుతాయి.**

**ఫీజు భారీగా పెంపుతో పాటు ఉద్యోగం మారేందుకు ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను తొలగించాలని కూడా DHS ప్రతిపాదించింది. ఈ నిబంధన అమలు చేస్తే ఉద్యోగం పోయిన వెంటనే వారు అమెరికాను విడిచిపెళ్లాల్సి వస్తుంది. లేదంటే స్టేటస్ ఉల్లంఘనలను ఎదుర్కొంటారు. అలాగే, హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు ఇచ్చే వర్క్ పర్మిట్లను రద్దు చేయడానికి ట్రంప్ యంత్రాంగం ప్రయత్నిస్తోంది. ఇదే జరిగితే పదేళ్లకు పైగా అర్హులైన H-4 వీసాదారులు చట్టబద్ధంగా పనిచేయడానికి ఉన్న అవకాశాన్ని తొలగించినట్లవుతుంది. H-4 వర్క్ పర్మిట్ ఉన్నవారిలో ఎక్కువ మంది భారతీయులే కావడంతో ఈ చర్యల వల్ల భారతీయ నిపుణులపైనే అత్యధిక ప్రభావం పడే అవకాశం ఉంది.**

## నేడు అయోధ్య రామాలయ తొలి సీఈవో పేరు వెల్లడి



ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ తొలి సీఈవో ఎవరనేది శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు బుధవారం ప్రకటించనుంది. ట్రస్టు అధ్యక్షుడు నృత్య గోపాల్‌దాస్ నివాసంలో మధ్యాహ్నం నుంచి జరిగే సమావేశానికి సీఈవో ఎంపిక కమిటీ తుది జాబితాను సమర్పిస్తుంది. ముగ్గురి పేర్లతో కూడిన ఆ జాబితా నుంచి ఒక పేరును ట్రస్టు ఖరారు చేస్తుంది. అలాగే కమిటీ ప్రధాన కార్యదర్శితోపాటు ఇద్దరు సభ్యుల పేర్లను కూడా వెల్లడించనున్నారు. సీఈవో ఎంపిక కమిటీ సభ్యులైన రిటైర్డ్ జస్టిస్ ప్రమోద్ కొహ్లీ, రిటైర్డ్ ఎల్జీ విష్ణుకాంత్ చతుర్వేదితోపాటు నిపుణుడైన మరో సభ్యుడు సురేశ్ హావ్డే ఇప్పటికే అయోధ్యకు చేరుకున్నారు. సీఈవో పోస్టు కోసం అందిన 5,585 దరఖాస్తులను పరిశీలించిన కమిటీ చివరి దశలో 16 మందిని ఇంటర్వ్యూ చేసినట్లు జస్టిస్ ప్రమోద్ కొహ్లీ మీడియాకు తెలిపారు. అయోధ్య రామాలయంలో కానుకలు, విరాళాల చోరీపై వచ్చిన ఆరోపణలతో తలెత్తిన వివాదం నేపథ్యంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శిగా ఉన్న చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్‌మిశ్ర తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ట్రస్టు సభ్యుడిగా ఉన్న విమలేంద్ర మోహన్ ప్రతాప్ మిశ్ర మరణంతో మొత్తం మూడు పదవులకు ఖాళీ ఏర్పడింది. మహారాష్ట్రలోని పుణెకు చెందిన ఆరెస్సెస్ అనుయాయి జగదీశ్ ఆఫ్లే రామాలయ నిర్మాణ సమయంలో ప్రాజెక్టు మేనేజరుగా వ్యవహరించారు. ఆలయ ట్రస్టు తొలి కార్యదర్శిగా ఈయన పేరే ఖరారు కానుంది. జగదీశ్ ఐఐటీ బాంబే నుంచి ఎంటెక్ చేశారు. వీహెచ్‌పీ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి బజరంగ్ లాల్ బాగ్డాకు సైతం ట్రస్టులో చోటు లభించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## 77% పాఠశాలల్లో బాలికలకు విడిగా శౌచాలయాలు



బడుల్లో బాలబాలికలకు వేర్వేరుగా శౌచాలయాలు ఉండాలన్న ఆదేశం దేశంలో 77% మేర అమలవుతోందని, మిగిలినచోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్రం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇలాంటివి 30,458 నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించింది. పాఠశాలల్లో శానిటరీ నాప్కిన్లు సమకూర్చడాన్ని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రారంభించాయని జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనానికి తెలిపింది. ఈ ఏడాది జనవరిలో కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు గత త్రైమాసికంలో ప్రభుత్వం ఏమేం చేసిందో వెల్లడించే నివేదికను అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి సమర్పించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కోర్టు ఆదేశాల అమలుకు చేతులు కలిపి ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలపై మరింత దృష్టి సారించాలంటూ తదుపరి విచారణను న్యాయస్థానం ఈ నెల 29కి వాయిదా వేసింది.

## అంత్యక్రియలు పూర్తైన నెలరోజులకు తిరిగొచ్చిన కుమారుడు



ఒడిశాలోని దేంకానాల్ జిల్లా బార్షింగాలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. తమ కుమారుడు తప్పిపోయాడని ఫిర్యాదు చేసిన ఓ కుటుంబానికి.. స్థానిక పోలీసులు ఓ మృతదేహాన్ని అప్పగించారు. అది తమ కుమారుడే అనుకొని భావించి అంత్యక్రియలు చేశారు. చనిపోయాడనుకున్న కుమారుడు.. నెల తర్వాత వారి ఇంటికి తిరిగి రావడం చూసి కుటుంబీకులు సహా గ్రామస్థులు ఆశ్చర్యానికి గురయ్యారు. బార్షింగా గ్రామానికి చెందిన సనాతన్ నాయక్ (29)కు మానసిక ఆరోగ్యం బాగాలేదు. తరచూ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడు. కానీ, జులైలో అలా వెళ్లిన అతడు మళ్లీ రాలేదు. దీంతో కంగారుపడిన కుటుంబీకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సమీపంలోని కునువా గ్రామంలో వరద నీటిలో కొట్టుకువచ్చిన ఓ మృతదేహం సనాతన్‌దేనని పోలీసులు భావించి అతడి కుటుంబీకులకు అప్పగించారు. దీంతో వాళ్లు మృతదేహం తమ కుమారుడిదే అనుకొని అంత్యక్రియలు నిర్వహించారు. ఇవన్నీ పూర్తైన నెల రోజులకు సనాతన్ ఇంటికి తిరిగి రావడంతో వారంతా ఆశ్చర్యపోయారు. అంత్యక్రియలు నిర్వహించిన ఆ మృతదేహం ఎవరిదనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కేంద్రమంత్రి చిరాగ్ పాస్వాన్‌కు బెదిరింపు



ఉగ్రవాదుల చేతిలో హతమవుతారంటూ కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్‌కు మంగళవారం బెదిరింపు వచ్చినట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆయనకు మరింత భద్రత కల్పించాలని కేంద్ర హోంశాఖను ఆ కార్యాలయం కోరింది. తనకు వచ్చిన బెదిరింపుపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలని లోక్ జనశక్తి పార్టీ (ఆర్) అధినేత పాస్వాన్ ఈ సందర్భంగా కోరారు. ఆయన ప్రస్తుతం కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిగా పని చేస్తున్నారు. ''కరుడుగట్టిన ఉగ్రవాదుల చేతిలో నువ్వు త్వరలో హతమవుతావు'' అంటూ కేంద్రమంత్రికి సందేశం అందిందని ఆయన అదనపు వ్యక్తిగత కార్యదర్శి కేంద్ర హోం శాఖకు లేఖ ద్వారా వివరించారు.



# 'జన్‌ధన్' ఆర్థిక భాగస్వామ్యానికి పునాది

"భారతీయులందరినీ అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకొచ్చేందుకు పన్నెండేళ్ల క్రితం 2014 ఆగస్టు 28న ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) పథకం ప్రారంభమైంది. సామాజిక మార్పునకు ఎంతో ఉపయోగపడిన పథకమిది. ఈరోజు వెనక్కి తిరిగి చూసుకుంటే, ఎన్ని ఖాతాలు ప్రారంభించాం అనేది కాకుండా ఆర్థిక సమ్మిళితత్వం అనే భావన ఎలా మారిందనేదే ముఖ్యం."

జన్‌ధన్ కింద బ్యాంకుల్లో దాదాపు 59 కోట్ల ఖాతాలు ప్రారంభించారు. వీటిలో రూ.3 లక్షల కోట్లకు మించి డిపాజిట్లు ఉన్నాయి. లబ్ధిదారుల్లో సగానికి పైగా మహిళలే. దాదాపు అయిదింట నాలుగు వంతుల ఖాతాలు గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల శాఖల్లో ఉన్నాయి. ఈ గణాంకాలు అధికారిక బ్యాంకింగ్ సేవల విస్తరణ ఎంత విజయవంతంగా జరిగిందో తెలియజేస్తున్నాయి. జన్‌ధన్ విజయం సాధించడంలో ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థదే కీలక పాత్ర. పీఎంజేడీవై ఖాతాల్లో దాదాపు 80శాతం ప్రభుత్వరంగ బ్యాంకుల్లోనే ఉన్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఈ పథకంలో మరింత చురుగ్గా భాగమైంది. ప్రస్తుతం ఎస్‌బీఐలో దాదాపు 16 కోట్ల పీఎంజేడీవై ఖాతాలున్నాయి. ఇవి గతంలో అధికారిక ఆర్థిక సేవలు పరిమితంగా ఉన్న లేదా అసలే అందుబాటులో లేని అనేక ప్రాంతాలకు బ్యాంకింగ్‌ను చేరువ చేశాయి. ఈ ఖాతాల సంఖ్యకంటే మరింత ముఖ్యమైన మార్పు బ్యాంకింగ్ సంబంధాల స్వభావంలో వచ్చిందనేది నా అభిప్రాయం.

**సామాన్యులూ బ్యాంకింగ్ వ్యవస్థలోకి...**

జన్‌ధన్ ప్రారంభమైనప్పుడు, ఈ ఖాతాలను జీరో బ్యాలెన్స్ ఖాతాలుగా పేర్కొనేవారు. ఇప్పుడు చూస్తే పీఎంజేడీవై ఖాతాల్లో సగటు నిల్వ రూ.5,000ను మించింది. అంటే ఈ ఖాతాలు అతి సామాన్యులనూ బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం మాత్రమే కాదు; వారు కూడా పొదుపు చేయడానికి, ఆదాయాన్ని స్వీకరించడానికి, చెల్లింపులు చేయడానికి ఉపయోగపడుతున్నాయి. ఆర్థికంగా మరింత స్థిరత్వాన్ని ఏర్పరచుకోవడానికి బ్యాంకింగ్‌ను సామాన్యులూ వినియోగిస్తున్నారు. ఈ పరిణామాన్ని చాలా దగ్గరగా చూసే అవకాశం నాకు లభించింది. కొత్త ఖాతాదారును బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడంలో తొలి అడుగు ఎంత కష్టమైనదో నాకు తెలుసు. జన్‌ధన్ రూపంలో ఇది నెరవేరింది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) వంటి సరళమైన బీమా, పింఛన్ ఉత్పత్తుల ద్వారా ఆర్థిక సమ్మిళితత్వం బ్యాంకు ఖాతాను మించి విస్తరించింది. ఇవి కుటుంబాలకు మెరుగైన ఆర్థిక రక్షణతో పాటు దీర్ఘకాలిక ఆర్థిక పునాది అందిస్తున్నాయి. ప్రధానమంత్రి ముద్రా యోజన, పీఎం స్వానిధి వంటి కార్యక్రమాల ద్వారా ఒనగూడుతున్న సమ్మిళిత రుణ సౌకర్యం కూడా ఈ ప్రయాణంలో ముఖ్యమైన భాగంగా మారింది. సంప్రదాయ బ్యాంకింగ్ సేవల ద్వారా చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులతో పాటు అట్టడుగు వర్గాలకూ అధికారిక రుణాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో ఈ పథకాలు సాయపడుతున్నాయి. రాబోయే సంవత్సరాల్లో ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లొచ్చు. దేశంలో డిజిటల్ ఆర్థిక మౌలిక సదుపాయాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండటం దీనికి ఉపకరిస్తోంది. ఆర్థిక కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నా, ఇప్పటికీ అవసరమైన ధ్రువీకరణలు, తగినంత ఆర్థిక సమాచారం లేని ప్రజలు ఎంతోమంది ఉన్నారు. ఇలాంటి వారిని గుర్తించి అంచనా వేయడం గతంలో అధికారిక ఆర్థిక వ్యవస్థకు కష్టంగా ఉండేది.

పీఎంజేడీవైలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. 32 కోట్ల మందికి పైగా మహిళలు ఈ పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారు. సొంత బ్యాంకు ఖాతా వల్ల, ఒక మహిళ ఆర్థిక వ్యవస్థతో వ్యవహరించే విధానమే మారిపోతుంది. ఆదాయాన్ని స్వీకరించడానికి, పొదుపు చేసుకోవడానికి, రుణం పొందడానికి, చివరికి ఒక వ్యాపారాన్ని ప్రారంభించడానికి లేదా విస్తరించడానికి సొంత ఖాతా పునాది అవుతోంది. స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)తో అనుసంధానం, మహిళలను మరింత శక్తిమంతంగా మారుస్తోంది. ప్రస్తుతం ఎస్‌హెచ్‌జీల్లో 10 కోట్లమందికి పైగా మహిళలు ఉన్నారు. ఇందులో పది శాతానికి పైగా మహిళలకు ఎస్‌బీఐ మద్దతు ఇస్తోంది. రైతులు, చిన్న వ్యాపారులు, స్వయంఉపాధి పొందుతున్న వారికీ ఇదే వర్తిస్తుంది. మొత్తం దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో 1.8 లక్షలకు పైగా శాఖలతోపాటు, 17లక్షల మందికి పైగా బిజినెస్ కరస్పాండెంట్లు ఉన్నారు. వీరిద్వారా అధికారిక బ్యాంకింగ్ సేవలు ప్రజలకు చేరుతున్నాయి. అయితే ఆర్థిక పథకాలు, సేవలు సరళంగా, సురక్షితంగా, అందుబాటు ధరల్లో లభించేలా చూడటమే కీలకం. ప్రజలకు ఆర్థిక సేవలు అందించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. డిజిటల్ ప్రజా మౌలిక వసతులు ఇందులో ముఖ్యం. అకౌంట్ అగ్రిగేటర్, యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్, డిజిటల్ చెల్లింపులు, భద్రతా చర్యల వంటివి ఖాతాదారు ఆర్థిక సామర్థ్యాన్ని మెరుగ్గా అర్థం చేసుకోవడానికి సాయపడుతున్నాయి. ఇందువల్లే కొత్తగా రుణం తీసుకునే వ్యక్తులకు అధికారిక ఆర్థిక సేవలు మరింతగా అందుబాటులోకి వస్తున్నాయి.

**అపూర్వ స్థాయిలో సమ్మిళితత్వం**

సాంకేతికత బ్యాంకింగ్‌ను మరింత సరళంగా మారుస్తోంది. డిజిటల్ ఇంటర్‌ఫేస్‌లతో సౌకర్యంగా లేని ఖాతాదార్లకు సహాయం చేయడానికి వాయిస్ ఇంటర్‌ఫేస్‌లు, భారతీయ భాషల్లో సేవలు, అసిస్టెడ్ బ్యాంకింగ్, సులభమైన అప్లికేషన్లు, కృత్రిమమేధ(ఏఐ) ఆధారిత కస్టమర్ సపోర్ట్‌పై కృషి చేస్తున్నాం. బ్యాంకింగ్ సేవలను మరింతగా వ్యక్తిగతీకరించే సామర్థ్యం ఏఐకి ఉంది. సాంకేతికత ద్వారా ఖర్చు తగ్గించుకుని, మరింత మందికి బ్యాంకులు సేవలు అందించగలవు. ఖాతాదారు ఆర్థిక స్థితిని అర్థం చేసుకుని, అవసరమైన సూచనలు అందించే ప్రపంచం వైపు మనం అడుగులు వేస్తున్నాం. జన్‌ధన్ మొదటి పన్నెండేళ్లలో ఆర్థిక సమ్మిళితత్వాన్ని అపూర్వ స్థాయిలో సాధించవచ్చని రుజువైంది. మరింత ఆర్థిక స్థిరత్వం, బలమైన వ్యాపారాలు, మహిళలకు మరిన్ని అవకాశాలు, బాధ్యతాయుత రుణాలకు మెరుగైన ప్రాధాన్యం ఇవ్వడం భవిష్యత్తులో సాకారమవుతాయి. మనదేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేస్తున్నందున ఆర్థిక సమ్మిళితత్వం ఒక లక్ష్యంగా మాత్రమే కాకుండా, విస్తృత ఆర్థిక భాగస్వామ్యానికి ముఖ్యమైన పునాదిగా మారుతుంది.




# దేశం కోసం సర్వస్వాన్ని ధారపోసిన చింతలచెరువు హంపమ్మ

**- మరచిపోతున్న మహాత్యాగానికి చరిత్రలో శాశ్వత స్థానం కల్పిద్దాం**





డా. ముచ్చుకోట సురేష్ బాబు

**భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఎందరో మహనీయుల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోయాయి. అయితే, దేశ స్వాతంత్ర్యం కోసం తమ సంపదను, ఆభరణాలను, వ్యక్తిగత సుఖసౌకర్యాలను త్యాగం చేసిన అనేక మంది సామాన్య ప్రజల చరిత్ర మాత్రం కాలగర్భంలో కలిసిపోతున్నది. అలాంటి అరుదైన దేశభక్తులలో రాయలసీమ నేల గర్వించదగ్గ మహాత్యాగి చింతలచెరువు హంపమ్మ ఒకరు. మహాత్మా గాంధీజీ చేపట్టిన హరిజనోద్యమ యాత్ర సందర్భంగా రాయలసీమ ప్రాంతానికి రావడం అనంతపురం జిల్లా చరిత్రలో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది. 1933 డిసెంబర్‌లో ప్రారంభమైన హరిజన యాత్రలో భాగంగా మహాత్మా గాంధీ ఆంధ్ర ప్రాంతంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఆ యాత్రలో భాగంగానే 1934 జనవరి 3న గాంధీజీ తన సహచరులతో కలిసి గుత్తి తాలూకా పరిధిలోని పెద్దవడుగూరు ప్రాంతానికి చేరుకున్నారు.మద్రాస్ మెరీనా బీచ్‌లో హరిజన యాత్ర సందర్భంగా జరిగిన సమావేశంలో గుత్తి ప్రాంతానికి చెందిన ప్రముఖులు పాల్గొని గాంధీజీ ఆలోచనలను, సందేశాన్ని ప్రత్యక్షంగా విన్నారు. స్వాతంత్ర్యోద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రజల సహకారం, ఆర్థిక వనరులు అత్యంత అవసరమని గాంధీజీ స్పష్టం చేశారు. స్థానిక ప్రముఖుడు కుమ్మెత్త చిన్నరపరెడ్డి ఆహ్వానం మేరకు గాంధీజీ పెద్దవడుగూరుకు విచ్చేశారు. గుత్తి రైల్వే స్టేషన్ నుండి ఆయనను స్వయంగా కారులో తీసుకువచ్చి, పెద్దవడుగూరులో బసకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. గాంధీజీ అక్కడ నాలుగు రోజుల పాటు బస చేసినట్లు స్థానిక చారిత్రక కథనాలు చెబుతున్నాయి.ఆ రోజులలో ఆయన ఉరవకొండ, కదిరి, ధర్మవరం వంటి ప్రాంతాలను సందర్శించి, తిరిగి రాత్రివేళ పెద్దవడుగూరుకు చేరుకునేవారు. ఎక్కడికి వెళ్లినా స్వాతంత్ర్యోద్యమం, సామాజిక సమానత్వం, అంటరానితనం నిర్మూలనతో పాటు దేశ సేవకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చేవారు.**

**గాంధీజీ కోసం తరలివచ్చిన వేలాది ప్రజలు**

గాంధీజీ పెద్దవడుగూరుకు వస్తున్నారనే వార్త చుట్టుపక్కల గ్రామాలకు చేరడంతో ప్రజల్లో అపారమైన ఉత్సాహం నెలకొంది. మహాత్ముడిని ఒక్కసారి చూడాలనే ఆశతో తెల్లవారుజామునే ప్రజలు సమావేశ ప్రాంగణానికి చేరుకున్నారు. సుమారు 12 వేల మంది ప్రజలు సభకు హాజరైనట్లు చెబుతారు. అంతటి భారీ జనసమూహాన్ని దృష్టిలో ఉంచుకొని ఎనిమిది అడుగుల ఎత్తులో ప్రత్యేక వేదికను నిర్మించారు. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంద సేవాదళ్ నాయకుడు కె. నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది సేవాదళ్ సభ్యులు ప్రజలు శాంతియుతంగా ఉండేలా సేవలందించారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో మహాత్మా గాంధీజీ సభా వేదికకు చేరుకున్నారు. చిన్నరపరెడ్డి ఖద్దరు పూలమాలతో గాంధీజీకి ఘనస్వాగతం పలికి వేదిక పైకి ఆహ్వానించారు. అనంతరం కమ్మర సాంబయ్య ప్రార్థనతో సభ ప్రారంభమైంది.గాంధీజీ తన ప్రసంగంలో అంటరానితనం నిర్మూలన, సామాజిక సమానత్వం, జాతీయ ఐక్యత, స్వాతంత్ర్యోద్యమ ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరించారు. ఆయన హిందీలో చేసిన ప్రసంగాన్ని శ్రీ సత్యనారాయణ తెలుగులోకి అనువదించారు.దేశ స్వాతంత్ర్యం కేవలం కొందరు నాయకుల పోరాటంతో సాధ్యం కాదని, ప్రతి భారతీయుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని గాంధీజీ పిలుపునిచ్చారు. దేశం కోసం త్యాగం చేయడమే నిజమైన దేశభక్తికి నిదర్శనమని ఆయన ప్రజలకు సందేశమిచ్చారు.

**హంపమ్మ త్యాగం... సభను కదిలించిన మహాక్షణం**

అప్పుడే ఆ సభలో ఒక అపూర్వమైన ఘట్టం చోటు చేసుకుంది.పెద్దవడుగూరు సమీపంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన దేశభక్తురాలు హంపమ్మ తన ఇంటి నుంచి రూ.1,116 తొలి విరాళంగా తీసుకొచ్చి గాంధీజీకి అందజేశారు. ఆమె దేశభక్తి, త్యాగస్ఫూర్తిని చూసిన గాంధీజీ ఆమెకు నమస్కరించి తన ప్రసంగాన్ని కొనసాగించినట్లు స్థానిక చరిత్ర చెబుతోంది.కానీ హంపమ్మ త్యాగం అక్కడితో ఆగలేదు.సభ ముగిసిన అనంతరం ఆమె మరోసారి గాంధీజీ వద్దకు వెళ్లింది. తన వద్ద ఉన్న నగదుతో పాటు తన బంగారు ఆభరణాలను కూడా దేశ సేవ కోసం సమర్పించింది. చివరికి తన మంగళసూత్రాన్ని కూడా విరాళంగా ఇవ్వడానికి వెనుకాడలేదు. ఆమె చేసిన ఆ మహాత్యాగం సభలో ఉన్న వేలాది మందిని కదిలించింది.హంపమ్మను చూసి పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రజలు తమ వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలను దేశం కోసం విరాళంగా అందించడం ప్రారంభించారు. ఒక్క మహిళ చేసిన త్యాగం వేలాది మందిలో దేశభక్తి జ్వాలను రగిలించింది.సభా వేదిక నుండి బయలుదేరే సమయంలో గాంధీజీ స్వయంగా హంపమ్మను అభినందించినట్లు చెబుతారు. ఆమె చూపిన త్యాగస్ఫూర్తి ఆ సభకు ప్రేరణగా నిలిచింది.ఆ సందర్భంగా సుమారు రూ.27 వేల నగదు మరియు 5.5 కిలోల బంగారం విరాళాల రూపంలో సమకూరినట్లు చారిత్రక వివరాలు తెలియజేస్తున్నాయి. ఇది ఆ కాలంలో ఎంతటి భారీ మొత్తం అనేది నేటి తరానికి ఊహించడం కూడా కష్టం.

**మన చరిత్రను మనమే మరచిపోతున్నామా?**

చింతలచెరువు హంపమ్మ పేరు నేడు ప్రధాన చరిత్ర పుస్తకాలలో పెద్దగా కనిపించకపోవచ్చు. కానీ ఆమె చేసిన త్యాగం మాత్రం భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక గొప్ప అధ్యాయం కావాలి.విచారకరమైన విషయం ఏమిటంటే, మన ప్రాంతానికి, మన సంస్కృతికి సంబంధం లేని అనేక విషయాలను గొప్పగా చెప్పుకుంటూ, మన కళ్ల ముందే జరిగిన చారిత్రక ఘట్టాలను, మన స్వాతంత్ర్యం కోసం సర్వస్వాన్ని ధారపోసిన స్థానిక మహనీయులను మాత్రం మనమే విస్మరిస్తున్నాం.చింతలచెరువు హంపమ్మ వంటి త్యాగధనుల గురించి భావితరాలకు తెలియజేయడం మన సామాజిక బాధ్యత.ఆమె త్యాగం వృథా కాకూడదు. ఆమె పేరు కేవలం ఒక గ్రామ జ్ఞాపకంగా మిగిలిపోకూడదు.

**హంపమ్మకు సముచిత గుర్తింపు ఇవ్వాలి**

ఇప్పటికైనా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థలు హంపమ్మ త్యాగానికి తగిన గుర్తింపు ఇవ్వాలి.గుత్తి-పెద్దవడుగూరు ప్రాంతంలోని ఒక ప్రధాన కూడలికి, రహదారికి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు లేదా మహిళా కళాశాలకు "చింతలచెరువు హంపమ్మ" పేరు పెట్టాలి.అదేవిధంగా, గాంధీజీ పెద్దవడుగూరులో నిర్వహించిన చారిత్రక సభను, హంపమ్మ చేసిన మహాత్యాగాన్ని స్మరించుకునేలా ఒక స్మారక శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలి. స్థానిక పాఠశాలల్లో, కళాశాలల్లో ఆమె త్యాగగాథను విద్యార్థులకు తెలియజేయాలి.చరిత్ర అంటే కేవలం రాజులు, మహారాజులు, ప్రముఖ నాయకుల జీవిత చరిత్ర మాత్రమే కాదు. దేశం కోసం తన సర్వస్వాన్ని అర్పించిన హంపమ్మలాంటి సామాన్య మహిళల త్యాగమే నిజమైన ప్రజా చరిత్ర.దేశ స్వాతంత్ర్యం కోసం తన మంగళసూత్రంతో సహా సర్వస్వాన్ని సమర్పించిన చింతలచెరువు హంపమ్మకు చరిత్రలో శాశ్వత స్థానం కల్పించడం మనందరి బాధ్యత.ఆమె పేరు ఒక కూడలిపై మాత్రమే కాదు——మన ప్రాంత చరిత్రలో, మన పిల్లల పాఠ్యాంశాల్లో, మన సమాజపు సామూహిక స్మృతిలో చిరస్థాయిగా నిలవాలి. చింతలచెరువు హంపమ్మను స్మరించుకోవడం అంటే కేవలం ఒక మహిళను గౌరవించడం కాదు... దేశం కోసం త్యాగం చేసిన ఒక యుగాన్ని గౌరవించడం.

# ఎక్కువ ఖర్చు చేస్తున్నామా?

**ఒకే దేశం, ఒకే జనాభా. కానీ ఏ కొలబద్దతో చూస్తామన్నదాన్ని బట్టి దేశంలో 'పేదలు' 5.3శాతమూ కావచ్చు, 82.1శాతమూ కావచ్చు. ఈ వైరుధ్యం సంక్షేమం అవసరంపై చర్చను మరోసారి ముందుకు తెస్తోంది. ముఖ్యంగా, జాతీయ ఆహార భద్రతా చట్టానికి కేంద్ర ప్రభుత్వం 2026 జూన్‌లో ముసాయిదా సవరణ బిల్లును విడుదల చేసిన నేపథ్యంలో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సవరణలు మంచివా కావా అనే విషయాన్ని పక్కన పెడితే, ఈ చర్చలో తరచూ వినిపిస్తున్న ప్రశ్న ఒకటుంది: 'ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఎదుగుతున్నవేళ, దాదాపు 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు ఇవ్వడం ఇంకా అవసరమా?'ఈ ప్రశ్నకు ప్రధానంగా రెండు రకాల స్పందనలు వినిపిస్తాయి: ఇంత భారీ స్థాయిలో ఉచిత రేషన్ ఇవ్వడం ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించకుండా సంక్షేమంపై ఆధారపడేలా చేస్తోందనేది ఒక వాదన. మరోవైపు, దేశం నిజంగా అంతగా అభివృద్ధి చెందితే ఇన్ని కోట్ల మందికి ఉచిత ఆహారం ఎందుకు అవసరమవుతోందని ప్రశ్నిస్తూ, ఆర్థికవృద్ధి కథనాన్నే అనుమానించేది మరో వాదన. కానీ ఈ రెండు వాదనలూ ఒక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోతున్నాయి: తీవ్రమైన పేదరికం నుంచి బయటపడటం, ఆర్థిక భద్రత సాధించడం ఒకటే కాదు. అందువల్ల ఆర్థిక వ్యవస్థ పెరుగుతూ, పేదరికం తగ్గుతున్నప్పటికీ సంక్షేమం అవసరం తప్పనిసరిగా తగ్గిపోదు.**



గత రెండు దశాబ్దాల్లో భారత ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పెరిగిందన్నది వాస్తవం. అదే సమయంలో పేదరికం కూడా భారీగా తగ్గింది. ప్రపంచ బ్యాంకు 2025 జూన్‌లో విడుదల చేసిన అంచనాల ప్రకారం, రోజుకు 3 డాలర్ల పేదరిక రేఖను ప్రమాణంగా తీసుకుంటే, 2011-12లో 27.1శాతంగా ఉన్న 'తీవ్రమైన పేదరికం' 2022-23 నాటికి 5.3శాతానికి తగ్గింది. కానీ కథ అక్కడితో పూర్తికాదు. పేదరికం తగ్గడం వేరు, ఆర్థిక భద్రత వేరు.

పేదరికాన్ని కొలిచేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఒకే ప్రమాణాన్ని ప్రపంచ బ్యాంకు ఉపయోగించదు. దిగువ-మధ్య ఆదాయ దేశాలకు పేదరిక ప్రమాణంగా నిర్ణయించిన 'రోజుకు 4.20డాలర్ల' లెక్కనే తీసుకుంటే, 2022-23లో భారత జనాభాలో 23.9శాతం మంది ఆ రేఖకు దిగువన ఉన్నారు. ఎగువ-మధ్య ఆదాయ దేశాలకు ఉపయోగించే 8.30 డాలర్ల ప్రమాణాన్ని తీసుకుంటే ఈ సంఖ్య ఏకంగా 82.1శాతానికి చేరుతుంది.

పేదరికానికి సంబంధించి 5.3శాతం, 23.9శాతం, 82.1శాతం అనే మూడు సంఖ్యలు ఒక కీలక వాస్తవాన్ని బయట పెడతాయి: ఏ ప్రమాణంతో కొలుస్తామన్నదాన్ని బట్టి 'పేద' అనే నిర్వచనం, ఆ పరిధిలోకి వచ్చే జనాభా - రెండూ పూర్తిగా మారిపోతాయి. తీవ్ర పేదరిక రేఖను దాటినంత మాత్రాన కోట్లాది మంది ఆర్థిక అభద్రత నుంచి బయటపడినట్లు కాదు.

ప్రముఖ రాజకీయ ఆర్థికవేత్త, భారతీయ వ్యవహారాలపై నిపుణుడు ప్రొఫెసర్ డియెగో మయోరానో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తారు. తీవ్ర పేదరికం నుంచి బయటపడినప్పటికీ, భారత జనాభాలో పెద్ద భాగం పేదరికానికి కొద్దిగా ఎగువన మాత్రమే జీవిస్తోందని; అనారోగ్యం, పంట నష్టం లేదా ఆదాయంలో అకస్మాత్తుగా వచ్చే దెబ్బలు వారిని మళ్లీ పేదరికంలోకి నెట్టగలవని ఆయన ఒక పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు. ఒక కుటుంబం అధికారికంగా దారిద్ర్య రేఖకు పైన ఉండవచ్చు. ఇంట్లో మోటార్ సైకిల్, స్మార్ట్ ఫోన్ ఉండవచ్చు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుతుండవచ్చు. బయటకు చూస్తే అది మధ్యతరగతి కుటుంబంలా కనిపించవచ్చు. కానీ ఆ కుటుంబంలో తీవ్రమైన అనారోగ్యం, ఉద్యోగం పోవటం లేదా పంట నష్టం సంభవిస్తే? ఒక్క సంఘటనే చిన్న పొదుపును తుడిచిపెట్టి, అప్పుల్లోకి నెట్టి, ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్ముకునేలా చేసి, ఆ కుటుంబాన్ని మళ్లీ పేదరికంలోకి తోసేయవచ్చు. అందుకే పేదరికం తగ్గడం వేరు; ఆర్థిక భద్రత సాధించడం వేరు.

ఈ ఆర్థిక అస్థిరత ఎంతమాత్రం ఊహాజనితం కాదు. 'ఇండియా హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే' డేటాను ప్రపంచ బ్యాంకు విశ్లేషిస్తే ఒక విషయం స్పష్టమైంది- 2005 నుంచి 2012 మధ్య 27శాతం కుటుంబాలు పేదరికం నుంచి బయటపడగా, 7శాతం కుటుంబాలు తిరిగి పేదరికంలోకి జారిపోయాయి. ఈ కోణంలోనే 80 కోట్ల ఉచిత రేషన్ లబ్ధిదారుల సంఖ్యను కూడా చూడాలి. నిజానికి ఇది ప్రస్తుత పేదరికానికి సంబంధించిన ప్రత్యక్ష అంచనా కాదు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం గ్రామీణ జనాభాలో 75శాతం, పట్టణ జనాభాలో 50శాతం వరకు కవరేజ్ కల్పించాలన్న నిబంధనను బట్టి, 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉచిత రేషన్ లబ్ధిదారుల సంఖ్య దాదాపు 81కోట్లుగా ఉంది. కాబట్టి వీరందరినీ అత్యంత పేదలుగా చూడటం కంటే, వారిలో ఎంతమంది ఆహార భద్రత వంటి రక్షణలు లేకుండా ఒక అనారోగ్యం, ఉద్యోగ నష్టం లేదా ఆదాయపు దెబ్బను తట్టుకోగలరన్నదే అడగాల్సిన అసలు ప్రశ్న. ఇన్ని సంవత్సరాలుగా సంక్షేమ పథకాలు అమలవుతున్నప్పటికీ ఈ అభద్రత ఇంకా ఉంటే సంక్షేమం విఫలమైందనుకోవాలా? అలా తేల్చడం తొందరపాటు. సంక్షేమం ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా భద్రమైన స్థితికి తీసుకెళ్లే ఏకైక సాధనం కాదు. ఆహార భద్రత, ఉపాధి హామీ, పింఛన్లు వంటి పథకాలు ఆర్థిక దెబ్బ వచ్చినప్పుడు కుటుంబం పూర్తిగా కిందపడిపోకుండా కనీస రక్షణను కల్పిస్తాయి. మనం గమనించాల్సింది- ఇవి లేకపోతే ఆ కుటుంబాలు ఎంత త్వరగా అప్పుల్లోకి, ఆకలిలోకి జారిపోతాయన్నది. అందువల్ల ఒక సంక్షేమ పథకం విజయాన్ని 'లబ్ధిదారుడు ఇంకా ఆర్థిక అభద్రతలోనే ఉన్నాడా?' అనే ఒక్క ప్రశ్నతో కొలవలేం. 'ఆ పథకం లేకపోతే వారి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉండేది?' అన్న ప్రశ్న కూడా అడగాలి. దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు స్థిరమైన ఉపాధి, తగిన ఆదాయం, అందుబాటులో వైద్యం, విద్య వంటి అంశాలు అవసరమే. సంక్షేమం వాటికి పూర్తి స్థాయి ప్రత్యామ్నాయం కాదు. కానీ ఆ స్థాయి భద్రత అందరికీ అందేంతవరకు, సామాజిక రక్షణ ఒక కీలకమైన ఆధారంగా ఉంటుంది.

మరి సంక్షేమంపై మనం నిజంగానే అధికంగా ఖర్చు చేస్తున్నామా? సంక్షేమ పథకాల పరిధి విస్తృతంగా ఉండటం వల్ల, దేశ సంపదలో అసాధారణంగా పెద్ద భాగాన్ని వాటికే ఖర్చు చేస్తున్నామనే అభిప్రాయం ఉంది. అయితే ఆర్థికవేత్త రీతికా ఖేరా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పది ప్రధాన సంక్షేమ పథకాలపై గత రెండు దశాబ్దాల వ్యయాన్ని పరిశీలించారు. వారి లెక్కల ప్రకారం, ఒక్క కోవిడ్ సంవత్సరంలో మాత్రమే ఈ పథకాల మొత్తం వ్యయం జీడీపీలో 3శాతాన్ని దాటింది. 2023-24లో జీడీపీలో వీటి వాటా దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉన్న స్థాయికి పెద్దగా భిన్నంగా లేదు. ఈ పరిశీలన కొన్ని ప్రధాన పథకాలకే పరిమితమైనప్పటికీ ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతుంది: విస్తృత కవరేజ్ ఉన్నంత మాత్రాన మనం నిజంగా అధికంగా ఖర్చు చేస్తున్నట్లా?

కోట్ల మందికి ఒక పథకం చేరుతున్నప్పటికీ, ఒక్కో కుటుంబానికి అందుతున్న సహాయం వారి వాస్తవ అవసరాలతో పోలిస్తే పరిమితంగానే ఉండవచ్చు. అందువల్ల కేవలం లబ్ధిదారుల సంఖ్యను మాత్రమే చూపిస్తూ సంక్షేమ వ్యయం తీవ్రభారంగా మారిందని తేల్చడం సరికాదు. దేశ ఆర్థిక సామర్థ్యంతో పోలిస్తే ఎంత ఖర్చు చేస్తున్నాం, ఆ ఖర్చు కుటుంబాలకు ఎంతవరకు ఆర్థిక రక్షణ కల్పిస్తోంది అన్నవే అసలైన ప్రశ్నలు.

చిన్న ఆర్థిక దెబ్బలకే కుటుంబాలు మళ్లీ పేదరికంలోకి జారే ప్రమాదం ఉన్నప్పుడు సంక్షేమాన్ని తగ్గించడం సరికాదు. కేవలం రేషన్ పంపిణీకే పరిమితం కాకుండా నాణ్యమైన ఉచిత వైద్యం, విస్తృత సామాజిక భద్రత వంటి వ్యవస్థలను అందించాలి. లబ్ధిదారుల సంఖ్య కంటే రక్షణ నాణ్యతను పెంచడమే ముఖ్యం. అందుకే సంక్షేమంపై చర్చ కేవలం సంఖ్యల చుట్టూ మాత్రమే తిరగకూడదు. ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ, పెరుగుతున్న ఆ సంపదలో కొంత భాగాన్ని పౌరుల ఆర్థిక భద్రత కోసం కేటాయించడం సహజమైన తదుపరి అడుగు కావాలి.

బహుశా అసలు ప్రశ్న 'ఇంకా సంక్షేమం ఎందుకు?' అన్నది కాదు. ఆర్థికంగా బలపడుతున్న భారత్, పెరుగుతున్న సంపదను తన పౌరుల ఆర్థిక భద్రతగా ఎంతవరకు మార్చగలుగుతోంది అన్నదే అసలు ప్రశ్న.

అనంత
జనశక్తి
జనం కోసమే మా అక్షరం
గురువారం | అనంతపురం | 03.09.2026 | 01

# ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంపిడిఒ

అగళి సెప్టెంబర్ 02,అనంత జనశక్తి న్యూస్ : అగళి మండలంలోని జంగమరపల్లి గ్రామములో ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యయుల హాజరు పట్టికలను,పాఠశాలనిర్వహణ రికార్డులను పరిశీలించారు. మధ్యహ్నాం భోజనం నాణ్యత పరిశీలించారు. తర్వాత భోదన ప్రమాణాలను గురించి సమీక్షించారు.




# వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తాం





- నాటి జలయజ్ఞం ఫలితాలతోనే నేడు అన్ని ప్రాంతాలకు నీరు
- ఉమ్మడి ఏపీలో 1.33 లక్షల కోట్లతో 86 సాగునీటి ప్రాజెక్టులు
- ఐదేళ్ల వైఎస్ఆర్ పాలనలోనే 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు
- నాడు జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అంటూ విమర్శించిన చంద్రబాబు
- నేడు సాగునీటి ప్రాజెక్టుల ఘనత తనదేనంటూ బాబు క్రెడిట్ చోరీ
- సంక్షేమ పథకాలతో పేదల పెన్నిధిగా వైఎస్ రాజశేఖరరెడ్డి
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- అనంతపురంలో మహానేత వైఎస్ఆర్‌కు ఘన నివాళి
- సేవా కార్యక్రమాలు చేపట్టిన వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు

అనంతపురం, సెప్టెంబర్ 2 :అనంత జనశక్తి న్యూస్

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్ చేపట్టిన జలయజ్ఞం ఫలితాలతోనే నేడు అన్ని ప్రాంతాలకు గోదావరి, కృష్ణా జలాలు చేరుతున్నాయని కొనియాడారు. బుధవారం వైఎస్ఆర్ 17వ వర్ధంతి పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి అనంతపురంలోని వైసీపీ జిల్లా కార్యాలయం, జెడ్పీ ఆవరణలోని వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల పెన్నిధి అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 'మహాప్రస్థానం' పేరుతో సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్నారని గుర్తు చేశారు. 2004లో ముఖ్యమంత్రి కాగానే తొలి సంతకం ఉచిత విద్యుత్ ఫైల్‌పై పెట్టి రైతు పక్షపాతిగా నిలిచారని తెలిపారు. ఐదేళ్ల తన పాలనలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ప్రజల జీవితాలను మార్చారని తెలిపారు. రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించిన సంక్షేమ ప్రదాన వైఎస్ఆర్ అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి పథకాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.

**రూ.1.33 లక్షల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు**

గోదావరి, కృష్ణా జలాలను ప్రతి ఎకరాకు అందించేలా రూ.1.33 లక్షల కోట్లతో జలయజ్ఞం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 86 సాగునీటి ప్రాజెక్టులను చేపట్టిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఐదేళ్ల వైఎస్ పాలనలో 16 ప్రాజెక్టులు పూర్తిగా..మరో 26 ప్రాజెక్టులను పాక్షికంగా పూర్తి చేశారని గుర్తు చేశారు. తద్వారా ఆ ఐదేళ్లలోనే 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడమే కాకుండా 4 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించినట్లు తెలిపారు. నాటి జలయజ్ఞం కారణంగానే నేడు అన్ని ప్రాంతాలకు గోదావరి, కృష్ణా జలాలు వస్తున్నాయన్నారు. ''గతంలో వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ ఇస్తానంటే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందని చంద్రబాబు అన్నారు. జలయజ్ఞం అంటే ధనయజ్ఞం అని విమర్శించారు. అసలు వ్యవసాయమే దండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు. అలాంటి వ్యక్తి ఈ రోజు జలయజ్ఞం కారణంగా అందుతున్న ఫలితాలను మాత్రం తన ఖాతాలోకి వేసుకుంటున్నాడు'' అని అనంత విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞంను ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని, వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల సేవా కార్యక్రమాలు**

వైఎస్ఆర్ 17వ వర్ధంతి సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అనంతపురంలో సేవా కార్యక్రమాలు కొనసాగాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద అన్నదానం చేశారు. బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వజనాస్పత్రిలో వైద్య చికిత్సల కోసం పరికరాలు అందించారు. వైసీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రంగస్వామి నగర్‌లోని స్పందన అనాధ ఆశ్రమంలో అన్నదానం చేశారు. లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తపోవనంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# ఘనంగా దివంగత సీఎం వైఎస్సార్ 17వ వర్ధంతి వేడుకలు



- కేతిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ.....
- వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు....

ధర్మవరం సెప్టెంబర్ 2 అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని ధర్మవరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. వైస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివాసం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి పీ ఆర్ టి సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు. వైఎస్సార్ ప్రజల సంక్షేమం కోసం అందించిన సేవలను కొనియాడుతూ ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



- సమస్య పరిష్కారం అయ్యే వరకు నిరంతర ఫాలోఅప్: హరీష్ బాబు....

ధర్మవరం సెప్టెంబర్ 2 అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకునే లక్ష్యంతో బీజేపీ ఆధ్వర్యంలో 'జనతా వారధి' కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచన మేరకు ధర్మవరం పట్టణంలోని 22వ వార్డు సాయినగర్‌లో ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై స్థానిక ప్రజల నుంచి వినతులు, సమస్యలకు సంబంధించిన పత్రాలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను హరీష్ బాబు దృష్టికి తీసుకురాగా, ప్రతి సమస్యను ఆయన శ్రద్ధగా విని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిపై నిరంతరం ఫాలోఅప్ చేస్తూ, సమస్య పరిష్కారం అయ్యే వరకు అండగా ఉంటామని హరీష్ బాబు తెలిపారు. ప్రజల నుంచి వినతి.. పరిష్కారం దిశగా ప్రతి అడుగు అనే నినాదంతో జనతా వారధి కార్యక్రమం కొనసాగుతుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

# గత ఐదేళ్లలో రోడ్లకు పడ్డ గుంతలు కూడా పూడ్చలేదు



- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు
- కనగానపల్లి మండలంలో రూ.3.40కోట్లతో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ
- 2పంచాయతీల ప్రజలకు, విద్యార్థులు, రైతులకు ఉపయోగకరం
- గుంతల రోడ్లకు మోక్షం కల్పిస్తున్నామన్న ఎమ్మెల్యే సునీత

రాప్తాడు సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లకు పడ్డ గుంతలు కూడా పూడ్చలేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు చేశారు. కనగానపల్లి మండల పరిధిలో ఆమె రూ.3.40కోట్లతో నూతన రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ధర్మవరం కళ్యాణదుర్గం రోడ్డు నుంచి వయా యలక్కుంట్ల మీదుగా భద్రాపురం గ్రామం వరకు 8కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఈ రోడ్డు యలక్కుంట్ల, నెమలివరం, బద్దలాపురం గ్రామాల ప్రజలకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు రైతులకు మండల కేంద్రంలోని కార్యాలయాలకు అనేక పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇక గుంతల వలన ఇబ్బంది పడే పరిస్థితి ఉండదన్నారు. గతంలో ఇక్కడ ఉన్న తారు రోడ్డు గుంతలు పడి ప్రజలు చాలా ఇబ్బంది పడేవారని.. గత ఐదేళ్ల వైసిపి పాలనలో కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయలేదన్నారు. దీంతో రోడ్డు మరింత దెబ్బతినిందన్నారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సునీత చొరవ తీసుకుని ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు తీసుకొచ్చారు. కనగానపల్లి మండలంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యంగా రోడ్ల నిర్మాణాల విషయంలో కనగానపల్లికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎమ్మెల్యే సునీత తెలిపారు...



# దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25%ఏపీకి వస్తున్నాయి

- ఇది సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషి వలనే సాధ్యమవుతోంది
- ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- 46వ డివిజన్ 5వ రోడ్డులో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం
- జగన్ ది పిచ్చి తుగ్లక్ వ్యవహారమంటూ దగ్గుపాటి విమర్శలు
- సమస్య చెప్పిన వెంటనే స్పందించే వ్యక్తి ఎమ్మెల్యేగా వచ్చారన్న స్థానికులు

అనంతపురం సెప్టెంబర్ 02,అనంత జనశక్తి న్యూస్

ఐదేళ్ల పిచ్చి తుగ్లక్ పాలనలో 10 లక్షల కోట్లు అప్పులు పెట్టిపోతే.. కేవలం ఏడాదిలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 46వ డివిజన్ ఐదవ రోడ్డులో పర్యటించారు. ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయన కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్తూ రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ప్రజలు తమ సమస్యలను చాలావరకు పరిష్కరించాలని ఎమ్మెల్యేతో అన్నారు. అలాగే కొన్ని సమస్యలను కూడా ఆయన దృష్టికి స్థానిక నాయకులు తీసుకురాగా.. వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్య చెప్పిన వెంటనే పరిష్కరించే నాయకుడు ఎమ్మెల్యేగా వచ్చారని ఈ సందర్భంగా స్థానిక స్థానికులు అన్నారు. ఏ సమస్య ఉన్నా.. వెంటనే ఫోన్ ద్వారా చెప్పిన సరే ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రం ఎంతో ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ కూడా ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నారన్నారు. మొదటి ఐదు సంతకాల్లోనే మెగా డీఎస్సీలో 16347 పోస్టులను భర్తీ చేశారన్నారు. పింఛన్లు పెంచడం, అన్నాక్యాంటీన్లు తిరిగి ప్రారంభించడంతోపాటు తల్లికి వందనం ఇంట్లో ఎంతమందికి పిల్లలు ఉన్నా అందరికీ అందిస్తున్నారన్నారు. ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, మత్స్యకార సేవ, చేనేతలకు ఉచిత విద్యుత్, నేతన్న సేవ వంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దేశ విదేశాల్లో తిరుగుతూ, అహర్నిశలు శ్రమిస్తూ రాష్ట్రానికి 25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25% ఏపీకే వస్తున్నాయంటే అది వారి కృషివలనేనన్నారు. అనంతపురం జిల్లాలో కూడా ఈ రెండేళ్లలో లక్ష కోట్ల వరకు పెట్టుబడులు వచ్చాయన్నారు. హంద్రీనీవా కాలువను 1800 క్యూసెక్కుల నుంచి 3800క్యూసెక్కులకు పెంచేలా..



3500 కోట్ల రూపాయలతో పనులు చేపట్టారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. 200 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌళిక వసతులు కల్పించామన్నారు. 160 కోట్ల రూపాయలతో త్వరలోనే కొత్త పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ రెండేళ్లలో 7.50 కోట్ల రూపాయల మేర సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేసినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్, యూనిట్ ఇంచార్జ్ పిఎల్ఎన్ మూర్తి, డివిజన్ అధ్యక్షుడు కుమార్, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, మాజీ కార్పొరేటర్ సరళ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ, డైరెక్టర్లు రంగాచారి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, బెస్త పవన్, పరమేశ్వర్, టిడిపి నాయకులు తోండపునాటి రమేష్, చేపల హరి, మారుతి కుమార్ గౌడ్, ఓంకార్ రెడ్డి, పొట్లూరి కేశవ నాయుడు, కాయగూరల శ్రీధర్, ఇస్మాయిల్, నాయుడమ్మ, మణిరవి, సున్నం శ్రీనివాసులు, మోహన్ కుమార్, బాలాంజనేయులు, దాడి రమేష్, సికిందర్, డాక్టర్ హరి, వడ్డేభవాని, శ్రీనివాస్ గౌడ్, గీతాంజలి, శోభ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# `ఆర్చరీ పోటీలలో గోమతి నారాయణ సీబీఎస్ఈ విద్యార్థుల ప్రతిభ




నెల్లూరు సెప్టెంబర్ 02, అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడా పోటీలలో నగరానికి చెందిన గోమతి నారాయణ సిబిఎస్ఈ ఇంటర్మీడియట్ విద్యార్థులు అత్యంత ప్రతిభను చాటి వివిధ విభాగాల్లో బంగారు, కాంస్య పథకాలను కైవసం చేసుకున్నారు. కర్నూలులో నిర్వహించిన ఆర్చరి ఛాంపియన్షిప్ పోటీలలో సౌత్ జోన్ –1, అండర్ –17 విభాగంలో చాట్ల అక్షయ్ మహాదేవ్ అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించగా , తిరుపతిలో జరిగిన అమరావతి ఆర్చరీ ఛాంపియన్షిప్ పోటీలలో గుణశ్రీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించారు.ఈ సందర్భంగా స్థానిక గోమతి నగర్ నందుగా నారాయణ సి బి ఎస్ ఈ కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ పవనార్క, పుష్పలత, కోర్ డీన్ కె ఎస్ ఆర్, ఆర్ ఐ ఓ ఆదిశేషు తదితరులు విద్యార్థులను పుష్పగుచ్ఛాలని అందించి అభినందించారు.అనంతరం వారు మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో విద్యతో పాటు వివిధ క్రీడా పోటీలలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. వారి ప్రతిభను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు నారాయణ విద్యాసంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి సూచనలతో విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడా పోటీలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలలో విజయం సాధించిన విద్యార్థులు చాట్ల అక్షయ్ మహాదేవ్, గుణశ్రీలకు ఉపాధ్యాయులు,సిబ్బంది, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపి స్వీట్స్ తినిపించారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఎస్కేయూ ముఖద్వారం వద్ద పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**అనంతపురం, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతపురం మార్కెట్ యార్డు చైర్మన్ బల్ల పల్లవి ముఖ్య అతిథిగా పాల్గొని పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బల్ల పల్లవితో పాటు డిస్కవరీ మీడియా అధిపతి, పర్యావరణ ప్రేమికుడు ఏజీ అనిల్ కుమార్ రెడ్డి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. ఆంజనేయులు, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్‌బాబు, మాజీ రెక్టార్ ప్రొఫెసర్ వెంకట నాయుడు, ప్రొఫెసర్ మునినారాయణ, ప్రొఫెసర్ రమణ, విద్యార్థి నాయకుడు జయంత్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు



**రాయదుర్గం, సెప్టెంబర్ 2 అనంత జనశక్తి న్యూస్**

రాయదుర్గం పట్టణంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.రాయదుర్గం నియోజకవర్గ ఇంచార్జ్ మంజునాథ్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ ప్రారంభించడమైనది. బైక్ ర్యాలీ పట్టణంలోని ఆర్.అండ్.బీ అతిథి గృహం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ లక్ష్మీ బజార్, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్ మీదుగా నేషనల్ ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వేలాది మంది జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం నేషనల్ ఫంక్షన్ హాల్‌లో ఎల్ఈడీ వాల్ ద్వారా నిర్వహించిన వర్చువల్ కార్యక్రమాన్ని కార్యకర్తలు వీక్షించి,అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు ఆత్మీయ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు పాటలకు కార్యకర్తలు కేరింతలు కొడుతూ, ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ జై జనసేన అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు షైక్ మహబూబ్ బాషా, యశస్వి, రూరల్ మండలాల కన్వీనర్లు, రవికుమార్, శివరాజ్ ,రంజిత్ కుమార్,హర్షవర్ధన్,మల్లికార్జున, కురుబ వంశీ, సికిందర్, బాసిరెడ్డి జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## జననేతకు ఘన నివాళులు



**రాయదుర్గం, ( గుమ్మగట్ట) సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్**

**జననేత స్వర్గీయ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా మండల వైసీపీ నాయకులు పూలమాలలు అర్పించి ఘన నివాళులర్పించారు. మండల కేంద్రంలో బుధవారం మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విలువలు స్ఫూర్తిదాయకం అన్నారు. అంతేకాకుండా పేదల సంక్షేమమే లక్ష్యంగా, రైతుల అభివృద్ధే ధ్యేయంగా, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలనే ఆశయంతో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.ఆయన ఆశయాలు, సేవలు, ప్రజల పట్ల చూపిన ప్రేమ ఎప్పటికీ మరువలేనివి.ఆ మహానేత పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీమతి భవాని, మాజీ సర్పంచులు కోట్ల ఉమేష్, కే.పీ దొడ్డి. రమేష్, ఎంపీటీసీలు గోవిందు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గోనబావి ప్రతాపరెడ్డి, రామాంజనేయులు, కే యం రాజు, శివ,ఖాసీమ్,కార్యకర్తలు అభిమానులు, కొత్తగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.**

## ఎంబీఏ విద్యార్థులకు జీవన, ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ

**అనంతపురము, సెప్టెంబర్ 2: అనంత జనశక్తి న్యూస్**



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం శ్రీకృష్ణదేవరాయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఎంబీఏ విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది.విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ యువత భారతదేశానికి గొప్ప శక్తి అని, వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్హతలతో పాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ కార్యక్రమ నిర్వాహకుడు వెంకట్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాల సాధనలో విద్యార్హతలతో పాటు నైపుణ్యాలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. శిక్షణలో ఉద్యోగ సంసిద్ధత, సమాచార నైపుణ్యాలు, ఇంటర్వ్యూ మెళకువలు, వృత్తి పరమైన సామర్థ్యాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ చి. కృష్ణుడు మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు
ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టర్ ప్రొఫెసర్ బి. అనిత, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ పి. మురళీకృష్ణ, స్కిమ్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి. ప్రభాకర్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు ఇతిహాస్ కె., సి. చరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అకడమిక్ కన్సల్టెంట్ రహమత్ బీ వందన సమర్పించారు.

## పేదవాడి కంట కన్నీరు తుడవడమే జనసేనాని పవన్ కళ్యాణ్ లక్ష్యం

- **మంత్రి కందుల దుర్గేష్**
- **మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో నిడదవోలులో ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు..కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించిన మంత్రి దుర్గేష్**
- **జనసేన యువజన విభాగం 'జై కొట్టు' లోగో ఆవిష్కరణను ఆసక్తిగా తిలకించిన మంత్రి దుర్గేష్, పార్టీ శ్రేణులు**
- **జనసేనాని ఆశయాలే స్ఫూర్తిగా సేవా కార్యక్రమాలు.. తిమ్మరాజుపాలెం శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, భారీ బైక్ ర్యాలీ, రోటరీ క్లబ్‌లో రక్తదాన శిబిరం ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్**
- **స్వయంగా బైక్ నడిపి జనసైనికుల్లో జోష్ నింపిన మంత్రి కందుల దుర్గేష్**
- **జనసేన యువజన విభాగం "జై కొట్టు" లోగో ఆవిష్కరణ.. నిడదవోలు శంకరాపురం హృదయాలయంలో దివ్యాంగ విద్యార్థులకు మిఠాయిల పంపిణీ, మొక్కలు నాటిన మంత్రి దుర్గేష్**
- **నిడదవోలును రూ.500 కోట్లతో అభివృద్ధి చేశాం.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి.. పార్టీ శ్రేణులకు మంత్రి దుర్గేష్ పిలుపు**
- **కూటమి ధర్మాన్ని పాటిస్తూనే క్షేత్రస్థాయిలో జనసేన బలోపేతానికి కృషి చేద్దామని వెల్లడి..ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలిసిన గొప్ప నాయకుడు పవన్ కళ్యాణ్ అంటూ మంత్రి దుర్గేష్ భావోద్వేగ ప్రసంగం**

**నిడదవోలు సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నిడదవోలు నియోజకవర్గంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో బుధవారం అత్యంత వైభవంగా, సేవా కార్యక్రమాలతో నిర్వహించారు. అనంతరం రోటరీ క్లబ్ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... గత పుష్కర కాలంలో (12 ఏళ్లలో) జనసేన పార్టీ ప్రస్థానాన్ని, పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను శ్రేణులకు సమగ్రంగా వివరించారు. జాతీయభావం, దేశ సమగ్రత, రాష్ట్ర ప్రగతి మరియు ప్రజాసేవే పరమావధిగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జనసేనను తీర్చిదిద్దారని పేర్కొన్నారు.

**డిప్యూటీ సీఎం పేరిట ప్రత్యేక పూజలు.. స్వయంగా బైక్ నడిపి శ్రేణుల్లో ఉత్సాహం నింపిన మంత్రి దుర్గేష్**

ఉదయం తిమ్మరాజుపాలెంలోని ప్రసిద్ధ శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేరిట మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయం నుండి రోటరీ క్లబ్ వరకు పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా బైక్ నడుపుతూ భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసైనికులు, వీరమహిళలు పార్టీ కండువాలు గాల్లో తిప్పుతూ, 'జై జనసేన', 'జై పవన్ కళ్యాణ్', 'జై కందుల' నినాదాలతో నిడదవోలును హోరెత్తించారు.

**దివ్యాంగులకు మిఠాయిల పంపిణీ - సేవా కార్యక్రమాలు:**

అంతకుముందు నిడదవోలు రూరల్ మండలం శంకరాపురం గ్రామంలోని 'హృదయాలయం'లో దివ్యాంగ విద్యార్థులతో మంత్రి దుర్గేష్ కొంత సమయం ఆహ్లాదంగా గడిపి, వారికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఉపముఖ్యమంత్రి జన్మదిన జ్ఞాపకార్థం అక్కడ మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలులో ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని మంత్రి దుర్గేష్ స్వయంగా ప్రారంభించారు. ఈ శిబిరంలో జనసైనికులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు.

**'జై కొట్టు' యువజన విభాగం ఆవిష్కరణ.. తిలకించిన పార్టీ శ్రేణులు:**

ఆ తర్వాత ఆన్‌లైన్ వేదికగా జనసేన యువజన విభాగం "జై కొట్టు" లోగోను పార్టీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించగా, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అందించిన ఆడియో సందేశాన్ని మంత్రి కందుల దుర్గేష్, పార్టీ శ్రేణులు, బిజెపి నాయకులు నిడదవోలు పట్టణంలోని రోటరీ క్లబ్ హాల్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్ లో ఆసక్తిగా తిలకించారు. కేరళలో చికిత్స పొందుతున్న డిప్యూటీ సీఎం సంపూర్ణ ఆయురారోగ్యాలతో తిరిగొచ్చి ప్రజాసేవలో కొనసాగాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు హార్థిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**'జనం కోసం పుట్టిన పార్టీ జనసేన'..రాజకీయాల పరమార్థం ప్రజాసేవే:మంత్రి దుర్గేష్**

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..జనసేనను కేవలం ఒక రాజకీయ పక్షంగా కాకుండా "జనం కోసం పుట్టిన పార్టీ"గా అభివర్ణించారు. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆలోచనలు సమాజంలో మరిన్ని విప్లవాత్మక మార్పులకు నాంది పలకాలని, ఆయన ఆశయాలు రాబోయే తరాలకు నిరంతర స్ఫూర్తిగా నిలుస్తాయని వెల్లడించారు. "విద్యార్థి దశ నుంచే నేను రాజకీయాల్లో ఉన్నాను. అధికారం కేవలం నాయకులకు పరిమితం కాకూడదు. పేదవాడి కంట కన్నీరు రాకుండా, వారి కళ్లలో చిరునవ్వు చూడటమే లక్ష్యంగా జనసేనాని పవన్ కళ్యాణ్ 2014లో జనసేనను స్థాపించారు. సీట్ల కంటే దుర్మార్గమైన వైసీపీ అప్రజాస్వామిక పరిపాలనను గద్దె దించడమే ప్రాముఖ్యమని భావించి, 21 ఎమ్మెల్యే, 2 ఎంపీ సీట్లతో తగ్గినా నెగ్గేలా కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టిన గొప్ప దార్శనికుడు ఆయన. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం పవన్ కళ్యాణ్‌ను ' తుఫాన్ ' అని అభినందించడం తెలుగువారందరికీ గర్వకారణం." అన్నారు.

**కూటమి ఏర్పాటులో జనసేన అధ్యక్షుడిది కీలక పాత్ర:మంత్రి దుర్గేష్**

గత ప్రభుత్వంలో నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న నారా చంద్రబాబు నాయుడిని అన్యాయంగా జైల్లో పెట్టిన సమయంలో, హైదరాబాద్ నుండి రాజమహేంద్రవరం, విజయవాడ వస్తున్న జనసేనాని పవన్ కళ్యాణ్‌ను ఎంతో మంది అడ్డుకున్నప్పటికీ వెరవక పాదయాత్రతో ముందుకు సాగారని గుర్తుచేశారు. రాజమహేంద్రవరం జైలు బయట మీడియా సమక్షంలో మొట్టమొదటి సారిగా టీడీపీజనసేనబీజేపీ కూటమి పోటీ గురించి బహిరంగంగా ప్రకటించిన తెగువ తమ నాయకుడు పవన్ కళ్యాణ్‌దేనని కొనియాడారు.

**రాష్ట్రంలో రికార్డు స్థాయిలో గ్రామసభలు, 'పల్లె పండుగ' ద్వారా పంచాయతీరాజ్ లో విప్లవం .. డిప్యూటీ సీఎం చొరవతో నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు:మంత్రి దుర్గేష్**

"డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖలను ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. దేశంలో ఏపీ పంచాయతీరాజ్ శాఖ రెండో స్థానంలో నిలవడానికి ఆయన కృషియే కారణం. నిడదవోలు అభివృద్ధికి ఉపముఖ్యమంత్రి మొదటి ఏడాదే రూ.11 కోట్లు, ఇటీవల 'శాస్కి' నిధుల కింద అన్ని నియోజకవర్గాల కంటే అత్యధికంగా నిడదవోలుకు రూ.28 కోట్లు కేటాయించారు.ఇప్పటివరకు నియోజకవర్గంలో రూ.500 కోట్లకు పైగా అభివృద్ధికై వెచ్చించాం. ఆయన బాటలోనే తాను, మంత్రి నాదండ్ల మనోహర్ తమ మంత్రిత్వశాఖల పురోగతికి కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను పక్కదారి పట్టించగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సహకారంతో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతోంది. ఈ నేపథ్యంలో పెరవలిలో అమరజీవి జలధార పథకానికి శంకుస్థాపన చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారని"మంత్రి దుర్గేష్ అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు పెద్ద ఎత్తున గ్రామసభలు నిర్వహించి 'పల్లె పండుగ 1 మరియు 2' ద్వారా పల్లెల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన డిప్యూటీ సీఎం తీరును వివరించారు.పంచాయతీరాజ్ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా పవన్ కళ్యాణ్ నాయకత్వంలో వేసిన కొత్త రోడ్ల వల్లే ఈరోజు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని కొత్త రోడ్లు వేస్తామని చెప్పారు.

**మంత్రిగా వచ్చిన అవకాశంతో అఖండ గోదావరి ప్రాజెక్టులో నిడదవోలు అంతర్భాగం:మంత్రి దుర్గేష్**

"నన్ను ఆశీర్వదించిన నిడదవోలు ప్రజలకు, మంత్రివర్గంలో అవకాశం ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. అదే విధంగా దార్శనికుడైన సీఎం చంద్రబాబు కేబినెట్ లో పనిచేయడం అదృష్టం అన్నారు. తనకు పర్యాటక మంత్రిగా వచ్చిన అవకాశంతో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో నిడదవోలును అంతర్భాగం చేసి అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం.ప్రాజెక్టులో భాగంగా శెట్టిపేట వద్ద గోదావరి కెనాల్ లో బోటింగ్, వేసైడ్ రెస్టారెంట్, చిల్డ్రన్స్ పార్క్, చినకాశీరేవు అభివృద్ధి, కోటసత్తెమ్మ ఆలయంలో భక్తులకు వసతులు కల్పిస్తున్నాం" అని తెలిపారు.జనసేనాని పవన్ కళ్యాణ్ ఇచ్చిన అవకాశానికి, ప్రజల నమ్మకానికి నిరంతరం ప్రజాసేవకుడిగా శ్రమిస్తాను అని పేర్కొన్నారు.

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు – సేవా మార్గం**

సినిమా రిలీజ్ లేదా పుట్టినరోజు వేడుకల సమయంలో కేవలం బాణాసంచా పేల్చడం, కేరింతలు, చప్పట్లు కొట్టడానికే పరిమితం కాకుండా రక్తదాన, వైద్య శిబిరాల వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చిన ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని, ఇతర రాష్ట్రాల్లోని తెలుగువారు సైతం ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

**స్థానిక పోరుకు జనసేన సై.. క్షేత్రస్థాయి బలాబలాలు అంచనా వేసే 14 మంది సభ్యుల కమిటీలో తాను సభ్యుడిని**

క్షేత్రస్థాయి బలాబలాలను అంచనా వేసేందుకు ఏర్పాటైన 14 మంది సభ్యుల కమిటీలో తాను కూడా సభ్యుడినని మంత్రి దుర్గేష్ తెలిపారు. జనసేన ఎక్కడ బలంగా ఉందో అక్కడ రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేలా ఈ కమిటీ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు నివేదిక సమర్పిస్తుందని వెల్లడించారు.

**యువజన విభాగానికి పిలుపు.. స్థానిక ఎన్నికలకు సమాయత్తం**

"యువతలో సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడానికే 'జై కొట్టు' విభాగాన్ని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. 'జై కొట్టు' ద్వారా సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న యువతకు సముచిత గౌరవం ఇచ్చి,నాయకత్వాన్ని వారి చేతికి అందించడమే పార్టీ లక్ష్యం. యువతదే నాయకత్వం అనే నినాదంతో ముందుకు సాగుదాం. రాబోయే స్థానిక సంస్థల (మున్సిపల్,కార్పొరేషన్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్) ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని పాటిస్తూనే కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాలకు అతీతంగా జనసేనను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలి. 2021లో ప్రతికూల పరిస్థితుల్లోనూ వైసీపీకి ధీటుగా నిలబడి జనసేన జెండా పట్టిన జనసైనికులు, వీరమహిళలను ఘనంగా సత్కరించాం.అదే ధైర్యంతో కూటమి ధర్మాన్ని పాటిస్తూనే పార్టీని శత సహస్ర వసంతాల పాటు నిలిచేలా క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి.త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి." అని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

**"కందుల దుర్గేష్ లో కూడా పవన్ కళ్యాణ్‌ను చూడండి":**

ఎన్నికల సమయంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిడదవోలు ప్రజలను ఉద్దేశించి "కందుల దుర్గేష్ లో కూడా పవన్ కళ్యాణ్‌ను చూడండి" అని పిలుపునిచ్చి నాలో, ఇక్కడి ప్రజల్లో గొప్ప ధైర్యాన్ని నింపారని మంత్రి దుర్గేష్ గుర్తు చేసుకున్నారు .2014లో టీడీపీ అధికారంలోకి రావడానికి, 2024లో కూటమి ఏర్పాటుకు జనసేనాని పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించారని, సీట్లు ముఖ్యం కాదని తగ్గి నిలబడటం ద్వారా జనసేనను అధికారంలో భాగస్వామ్యం చేసి పేదవారి కలలను నిజం చేస్తున్నారని తెలిపారు.



## అనేక విద్యార్హతలు.. ఒకే విశ్వవిద్యాలయంతో సుదీర్ఘ అనుబంధం

- **డాక్టర్ రవికుమార్ బొప్పనకు ఘన సత్కారం**

**గుంటూరు, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పర్యాటక, ఆతిథ్య నిర్వహణ విభాగంలో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు హాజరై తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి డాక్టర్ రవికుమార్ బొప్పనను విభాగాధిపతి ప్రొఫెసర్ పి. పూర్ణచంద్రరావు, సీనియర్ అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.డాక్టర్ రవికుమార్ బొప్పనకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో సుదీర్ఘమైన విద్యా అనుబంధం ఉంది. ఇదే విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆయన పలు ఉన్నత విద్యా కోర్సులను పూర్తి చేశారు. పర్యాటక, ప్రయాణ నిర్వహణలో ఎంబీఏ, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో ఎంఏ, వ్యవసాయ ఆర్థిక శాస్త్రం, గ్రామీణాభివృద్ధిలో ఎంకామ్ తో పాటు అనుబంధ సిద్ధార్థ లా కళాశాల నుండి బీఎల్ అభ్యసించారు. సహకార నిర్వహణలో ఉన్నత డిప్లొమాను సైతం పొందారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయంలోని వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'సామాజిక మాధ్యమాల నిర్వహణ వ్యూహాలు – సంప్రదాయ మాధ్యమాలపై వాటి ప్రభావం – ఒక విశ్లేషణ' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో విద్యను అభ్యసించిన డాక్టర్ రవికుమార్ బొప్పనకు ఈ సంస్థతో ప్రత్యేక అనుబంధం ఉంది. విద్యార్థిగా తాను గడిపిన విశ్వవిద్యాలయ ప్రాంగణానికి పూర్వ విద్యార్థిగా తిరిగి రావడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా విభాగాధిపతి ప్రొఫెసర్ పి. పూర్ణచంద్రరావు, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎస్.ఏ. రహిమాన్ సాహెబ్, అధ్యాపకులు డాక్టర్ జి. జ్యోతి, డాక్టర్ ఎన్. గీతా సోని, డాక్టర్ కె. రాజేష్, డాక్టర్ చ. రాజీవ్ తదితరులు డాక్టర్ రవికుమార్ బొప్పనను అభినందించారు.పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు తమ అధ్యాపకులను, స్నేహితులను కలుసుకుని విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులతో నిరంతర అనుబంధాన్ని కొనసాగించడం ద్వారా విశ్వవిద్యాలయానికి, ప్రస్తుత విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అధ్యాపకులు పేర్కొన్నారు.



# 'శానిటరీ కిట్ల'తో బీసీ హాస్టళ్లలో పరిశుభ్రత

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- రూ.6 కోట్లతో అన్ని హాస్టళ్లకూ శానిటరీ కిట్ల పంపిణీ
- ఒక్కో కిట్ లో 11 రకాల వస్తువులు
- పరిశుభ్ర వాతావరణంలో బీసీ బిడ్డల విద్య
- హాస్టళ్లలో పారిశుధ్యం మెరుగుకు 1,200 మందిని నియమించాం
- రాబోయే టెన్త్, ఇంటర్ కు ఇప్పటి నుంచే ప్రణాళికలు అమలు
- విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ : మంత్రి సవిత



**అమరావతి సెప్టెంబర్ 02,అనంత జనశక్తి ప్రతినిధి**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నిర్దేశించుకున్న 'విజన్-2047' లక్ష్యాలను చేరుకునే క్రమంలో భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన ఆరోగ్యం, పరిశుభ్రమైన వాతావరణం, మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. బీసీ హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నామని, ఇందుకోసం రూ.6 కోట్ల విలువైన శానిటరీ కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. బుధవారం విజయవాడ గుణదలలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సవిత శానిటేషన్ మెటీరియల్‌తో కూడిన శానిటరీ కిట్లను వర్కర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న బీసీ హాస్టళ్ల రూపురేఖలు మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. గతంలో బీసీ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు అధికారంలోకి వచ్చిన వెంటనే మరమ్మతులు చేపట్టి అవసరమైన మౌలిక వసతులను కల్పించామన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్లు, విద్యుత్ అంతరాయం లేకుండా ఇన్వర్టర్లు, కిటికీలకు నెట్లు, విద్యార్థుల సౌకర్యార్థం హ్యాంగింగ్ హుక్స్ వంటి వసతులను ఏర్పాటు చేశామన్నారు.

**బీసీ హాస్టళ్లకు రూ.6 కోట్లతో శానిటరీ కిట్లు**

హాస్టళ్లలో పారిశుధ్యానికి అత్యధిక ప్రాధాన్యం కల్పించామన్నారు. వసతి గృహాల్లో పారిశుధ్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సుమారు 1,100 కొత్త టాయిలెట్లను నిర్మించామని మంత్రి తెలిపారు. వాటి నిర్వహణ, పరిశుభ్రత కోసం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది శానిటేషన్ వర్కర్లను నియమించినట్లు చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్యను బట్టి శానిటేషన్ సిబ్బందిని కేటాయించామని తెలిపారు. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నిరంతరం కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. టాయిలెట్లు, వాష్‌రూమ్‌లు, ఇతర ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సుమారు రూ.6 కోట్ల వ్యయంతో 11 రకాల వస్తువులతో కూడిన శానిటరీ కిట్లను ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సవిత తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వంటి ప్రత్యేక సేవలను కూడా అందిస్తున్నామని చెప్పారు. టాయిలెట్లు, కారిడార్లు, తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు సంబంధించి శానిటేషన్ సిబ్బందికి స్పష్టమైన ఎస్ఓపీ (SOP) జారీ చేశామని, కిట్ల నిర్వహణపై వార్డెన్లకు కూడా నిబంధనలు రూపొందించామని వివరించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా హాస్టళ్లను 1స్టార్ నుంచి 5స్టార్ వరకు విభజించి, నెల, మూడు నెలలకు ఒకసారి, ఆరు నెలలకు ఒకసారి, వార్షికంగా అవసరమైన శానిటేషన్ సామగ్రిని అందించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**విద్యార్థులకు ప్రత్యేక తరగతులు**

హాస్టల్ విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనకు ఇప్పటినుంచే ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో ప్రత్యేక కోచింగ్ తరగతులు కూడా నిర్వహిస్తున్నామన్నారు. 'తల్లికి వందనం'తో పాటు ఇంటర్ విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' ద్వారా ప్రభుత్వం విద్యార్థులకు పూర్తి అండగా నిలుస్తోందన్నారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలన్న ముఖ్యమంత్రి ఆలోచన మేరకు డైట్ ఛార్జీలను 10 శాతం పెంచినట్లు మంత్రి తెలిపారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వసతి గృహాలకు అవసరమైన కొత్త వంట సామగ్రిని సమకూర్చడంతో పాటు, అవసరానికి అనుగుణంగా కుక్‌కమ్‌అటెండర్లు, కుక్స్, హెల్పర్లను కూడా నియమిస్తున్నామని తెలిపారు. హాస్టళ్లలో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు 'నెట్ జీరో హెల్తీ క్యాంపస్' కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ తెలిపారు. గత రెండేళ్లుగా ప్రతి 15 రోజులకు ఒకసారి హాస్టళ్ల పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తూ, అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని వివరించారు. హాస్టళ్ల పరిశుభ్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో శానిటేషన్ సిబ్బందిని నియమించడంతో పాటు, అవసరమైన శానిటేషన్ మెటీరియల్‌ను అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్. మల్లిఖార్జున మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని బీసీ హాస్టళ్లలో తొలిసారిగా దాదాపు 1,290 మంది పారిశుధ్య కార్మికులను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కార్మికులను కేటాయించామని చెప్పారు. హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా 1 నుంచి 5 స్టార్ శానిటేషన్ కిట్లను రూపొందించి, వార్షికంగా రూ.15 వేల నుంచి లక్ష రూపాయలకు పైబడిన విలువైన సామగ్రిని అందిస్తున్నట్లు వెల్లడించారు. టాయిలెట్లు, కారిడార్లు, తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు ఎస్వోపీలు అమలు చేస్తున్నామని, కిట్ల నిర్వహణపై వార్డెన్లకు నిబంధనలు రూపొందించినట్లు తెలిపారు. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించి విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా వారి ఆరోగ్యాన్ని కాపాడటమే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని మల్లిఖార్జున పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మంత్రి సవిత మధ్యాహ్న భోజనం చేశారు. హాస్టల్ లో అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు హాస్టల్ లో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకును పరిశీలించి, నీరు తాగి సంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థినులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజన ఆహార పదార్థాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆర్.శ్రీధర్ రెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఈ. జగ్గయ్య, వార్డన్ ఎమ్.రజని పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి న్యాయవాదుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఆహ్వానం




**తాడేపల్లి, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి న్యాయవాదుల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ -2026కు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని బెజవాడ బార్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి న్యాయవాదుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్ వివరాలను మంత్రికి ప్రతినిధులు వివరించారు.ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్ బాబు, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి. కిరణ్, ఈసీ సభ్యుడు టి. కిరణ్, స్పోర్ట్స్ సెక్రటరీ జి. రామ్ తేజ, నిర్వాహకురాలు రైసా తదితరులు పాల్గొన్నారు.

# టెట్ ను రద్దు చేయాలి.



**- ఏపీటీఎఫ్ డిమాండ్**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్:**

మంగళగిరి లోని విద్యాభవన్ ముందు టెట్ పై జరుగు ధర్నా యొక్క కరపత్రాన్ని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బి. కె. ముత్యాలప్ప జిల్లా ఉపాధ్యక్షులు సానే. రవీంద్ర రెడ్డి, బలరాముడు,జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ వాసుకుమార్ , జిల్లా నాయకులు బయన్న, సీకే పల్లి అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి లు రామకృష్ణ , దుర్గ ప్రసాద్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు నాగభూషణ మండల నాయకులు ఓబులేసు,రవి , సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. సెప్టెంబర్ 2 నుండి 12 వరకు జరుగు నిరవధిక ధర్నాను ఏపీపీఎఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవాడ లో హాజరై జయప్రదం చేయవలెనని తెలియజేయడమైనది. 2010 కంటే ముందే నియమింపబడిన సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేసారు.సీకే పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని వారు ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలు అయిన పీఆర్సీ, డి ఏ లు, ఆర్థిక బకాయిలు సీపీఎస్ రద్దు వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయినాథ్ రెడ్డి, రామయ్య, మోహన్ రెడ్డి, నాగభూషణం, శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న కూటమి ప్రభుత్వానికి జై కొట్టాలి

- మంత్రి కందుల దుర్గేష్
- కడియం, కాతేరులలో ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు
- ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసిన మంత్రి కందుల దుర్గేష్
- సేవా దృక్పథంతోనే సమాజ పురోగతి: మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి దుర్గేష్

**రాజమహేంద్రవరం సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**




రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కాతేరు, కడియంలలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసైనికులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరై, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనసైనికులతో కలిసి "జై పవన్ కళ్యాణ్, జై జనసేన"అంటూ నినాదాలు చేశారు.

ఉచిత మెగా రక్తదాన శిబిరం ప్రారంభం

తొలుత కడియంలోని పాటంశెట్టి సత్యంవెంగాయమ్మ కళ్యాణ వేదికలో 'చిరు సేవా సమితి' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా రక్తదాన శిబిరాన్ని మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రశంసించడంతో పాటు, రక్తదానం చేసిన యువతను ప్రత్యేకంగా అభినందించి వారికి మెమొంటోలను అందజేశారు.

జనసేనాని పవన్ కళ్యాణ్ పాలనా దక్షతపై మంత్రి దుర్గేష్ ప్రశంసలు

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిలబడి జనసేన జెండాను రెపరెపలాడించిన ధీరుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జనసేనాని పవన్ కళ్యాణ్ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా 'పల్లె పండుగ'తో గ్రామీణాభివృద్ధికి బాటలు వేశారు. గ్రామీణ నీటి సరఫరా ద్వారా 'అమరజీవి జలధార'తో ప్రతి ఇంటికి సురక్షిత మంచి నీటిని అందిస్తున్నారు.అటవీ, పర్యావరణ శాఖ ద్వారా ప్రకృతి పరిరక్షణకు, పర్యావరణ సమతుల్యతకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు.. యువత భవిష్యత్తే లక్ష్యంగా రాష్ట్ర జనసేన యువజన విభాగానికి 'జై కొట్టని' అని నామకరణం చేశామని, యువతను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనా అనుభవానికి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆలోచనా విధానానికి మద్దతుగా నిలుస్తూ... అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ జై కొట్టాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

# జనసేన జోష్

**- చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ....**

**ధర్మవరం సెప్టెంబర్ 2 అనంత జనశక్తి న్యూస్ :**




జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ధర్మవరం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టగా.. జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. "ప్రజల కోసం నిరంతరం పరితపించే నాయకుడికి ప్రజలే అండగా నిలవాలి" అనే నినాదంతో సాగిన ఈ బైక్ ర్యాలీ జనసేన శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. భారీ సంఖ్యలో బైక్‌లతో నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సేవే పవన్ కళ్యాణ్ లక్ష్యం....

ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తున్న పవన్ కళ్యాణ్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు.

జనసేన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి...

జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఐక్యంగా పనిచేయాలని చిలకం మధుసూదన్ రెడ్డి సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని కోరారు.

ప్రత్యేక స్క్రీన్ పై లైవ్ కార్యక్రమం.. అనంతరం అన్నదానం....

పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ధర్మవరం జనసేన పార్టీ కార్యాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక స్క్రీన్‌పై ప్రసారమైన పవన్ కళ్యాణ్ జన్మదిన లైవ్ కార్యక్రమాన్ని చిలకం మధుసూదన్ రెడ్డి, జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలతో కలిసి వీక్షించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలకు అన్నదానం నిర్వహించారు. జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగగా.. జనసేన శ్రేణులు పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# గోదావరి జలాలతో ఉత్తరాంధ్ర జలస్వప్నం సాకారం

- ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకురావడంలో సీఎం చంద్రబాబు నాయుడు చూపిన ప్రత్యేక చొరవ అభినందనీయం
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి చారిత్రాత్మక మలుపు
- చంద్రబాబు దృఢ సంకల్పంతోనే ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- శ్రీకాకుళం చివరి ఆయకట్టు వరకు గోదావరి జలాలు రావాలన్నదే మా ఆకాంక్ష

**అనకాపల్లి సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**



ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల జలస్వప్నం సాకారమైన వేళ గోదావరి జలాలు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు చేరుకోవడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పం, నిరంతర పర్యవేక్షణతోనే గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకాయని పేర్కొన్నారు.ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తరుణం నిజమైంది. ప్రాజెక్టు పనుల్లో ఎదురైన అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్ అడ్డంకులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల స్వల్ప వ్యవధిలోనే అధిగమించి, రికార్డు స్థాయిలో కాలువ నిర్మాణ పనులను పూర్తి చేశారు,జలహారతి ఇచ్చి పాయకరావుపేట వద్ద రెగ్యులేటర్ ఆన్ చేసిన రైతులకు సాగునీరు విడుదల చేసిన సీఎం చంద్రబాబు చారిత్రాత్మక విజయమని మంత్రి కొనియాడారు.పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు చేరుకోవడం తొలి ఘట్టం మాత్రమే. రాబోయే రోజుల్లో ఈ జలాలు విజయనగరం దాటి చివరి ఆయకట్టు ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లా వరకు చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. సిక్కోలు నేలను సస్యశ్యామలం చేసే గోదావరి జలాల కోసం ఉత్తరాంధ్ర ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్రలో ప్రతి ఎకరానికి సాగునీరు, ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించే లక్ష్యం నెరవేరే వరకు కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పట్టుదలతో శరవేగంగా పూర్తయిన ఈ ప్రాజెక్టు ద్వారా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు సాగు, తాగునీటితో పాటు పరిశ్రమలు, అవసరాలకు 23.44 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. ఇది కేవలం జల ప్రాజెక్టు మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరిచే ప్రాజెక్టు అని పేర్కొన్నారు.రెండేళ్లలో కాలువ తవ్వకం, క్లిష్టమైన అక్విడక్ట్ నిర్మాణాలతో సహా కీలక పనులను రికార్డు వేగంతో పూర్తి చేసిన ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకి వేల చరిత్రలో నిలిచిపోతుంది. ఉత్తరాంధ్రను సుజల సస్యశ్యామలంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం. అనకాపల్లితో మొదలైన ఈ జలయాత్ర శ్రీకాకుళం చివరి ఆయకట్టు వరకు కొనసాగాలన్నదే మా లక్ష్యం" అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# డిగ్రీ ఫలితాలలో అద్భుతం.

- శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిల ప్రభంజనం.
- కరస్పాండెంట్ జగదీష్.

**ధర్మవరం సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్:**

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రకటించిన మొదటి సెమిస్టర్ ఫలితాలలో ధర్మవరం పట్టణానికి చెందిన స్థానిక ఎల్. పి. సర్కిల్ లోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు యూనివర్సిటీ టాపర్స్ గా నిలిచారు అని కరెస్పాండెంట్ జగదీష్ ,ప్రిన్సిపాల్ మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... బీఎస్సీ, స్టాటిస్టిక్స్ గ్రూపు నందు ఎన్ .నీలిమ, ఏ. వీణ, ఎం. దివ్య, ఎం.అంజలీబాయి 100 శాతము మార్కులతో, జి.పూజిత 96 సాతము, ఎస్. పావని 94 శాతము, కె.. మమత 93 శాతము, ఏ. ప్రేమలత93 శాతము , బీకాం కంప్యూటర్స్ గ్రూపు నందు బి. దివ్య లక్ష్మి 93 శాతము, యు. మాధవి 91 శాతము, ఎన్. రూపశ్రీ 90 శాతము, జి.యశోద 90 శాతము, బీఎస్సీ కంప్యూటర్స్ గ్రూపు నందు పి. దీపిక 91 శాతము, ఏ. విష్ణుశ్రీ 90 శాతము, బి. అక్షయ 88 శాతము, పి. రమ్య దైన 87 శాతము, సి .జ్యోతిక 85 శాతము, బి బి ఏ గ్రూపు నందు ఎస్ ఎం రోషిణి 85 శాతము,, ఎస్. తస్మియ 83 శాతము,, జె. హైందవి 81 శాతము, జి. నిత్యశ్రీ 80 శాతము, బి.హేమలత 80 శాతము తో ఉత్తీర్ణులైనారు అని తెలిపారు. ఓవరాల్ గా 75 శాతము (డిస్టింక్షన్) పైన 97 మంది విద్యార్థినులు అద్భుత ఫలితాలను సాధించిన వారికి కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, కరెస్పాండెంట్ జగదీష్ మిఠాయిలను పంచి పెట్టి అభినందించారు.ఇంతటి ఘన విజయానికి కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు.



# ప్రమాదకర ప్లాస్టిక్ కవర్లపై ఆకస్మిక తనిఖీ.



**- నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వద్దు.**

**- అసిస్టెంట్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్యామ్ సన్**

**ధర్మవరం సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్:**

అసిస్టెంట్ కమిషనర్ఉమామహేశ్వరరావుఆధ్వర్యంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలతో కలిసి బుధవారం మార్కెట్ స్ట్రీట్, జేజేఆర్ నగర్, పి.ఆర్.టి. స్ట్రీట్, ఇందిరానగర్ వార్డుల్లో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని శానిటరీ ఇన్స్పెక్టర్ శ్యామ్ సన్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఈ తనిఖీల్లో నిషేధిత ప్లాస్టిక్ను విక్రయిస్తున్న వ్యాపారుల వద్ద నుంచి సుమారు 40 కిలోల ప్లాస్టిక్ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి మొత్తం రూ.15,000 జరిమానా విధించారు. అనంతరం వారు మాట్లాడుతూ... నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలను అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

# ఘనంగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17 వర్ధంతి కార్యక్రమం



**శెట్టూరు ,సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్.**

జననేత స్వర్గీయ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా మండల వైసీపీ నాయకులు పూలమాలలు అర్పించి ఘన నివాళులర్పించారు. మండల కేంద్రంలో బుధవారం మండల కన్వీనర్ MS.హనుమంతరాయుడు,ఆధ్వర్యంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా , నాయకులు మాట్లాడుతూ,డాక్టర్ వైయస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా అందించిన సేవలను కొనియాడారు. ఆయన విలువలు స్ఫూర్తిదాయకం అన్నారు. అంతేకాకుండా పేదల సంక్షేమమే లక్ష్యంగా, రైతుల అభివృద్ధే ధ్యేయంగా, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలనే ఆశయంతో ఎన్నో , పేదలకు రాజు ఆరోగ్యశ్రీ విద్యార్థులకు పేదలకు ఇందిరమ్మ ఇల్లు రైతులకు ఉచిత విద్యుత.సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.ఆయన ఆశయాలు, సేవలు, ప్రజల పట్ల చూపిన ప్రేమ ఎప్పటికీ మరువలేనివి.ఆ మహానేత పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సోమనాథ్ రెడ్డి, మాజీ సర్పంచులు బొచ్చు పల్లి ,ప్రకాష్ ,మాకోడికి ,సత్యనారాయణ రెడ్డి,నాయకులు, ముచ్చర్లపల్లి విజయ్ కుమార, హరినాథ్ రెడ్డి,తిప్పేస్వామి ,టైగర, వన్నూరు స్వామి, చటాకుల రామాంజనేయులు మిద్దె సుధాకర, శ్యాంసుందర్. గౌరయ్య బాబు రెడ్డి నాగేంద్ర.మండల కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు వైఎస్ఆర్సిపి అభిమానులు పాల్గొన్నారు.

# రీ– సర్వే పనుల పరిశీలన

**-క్షేత్రస్థాయిలో పరిశీలన, రీ- సర్వే పనుల పురోగతి భూ వివరాల నమోదు.**

**-జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్.**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని సి.కె పల్లి మండలంలో గల న్యామద్దల గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ మౌర్య భారద్వాజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే పనుల పురోగతి, భూ వివరాల నమోదు, సరిహద్దుల నిర్ధారణ తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.రీసర్వే పనులను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా, ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, రైతులు, భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.తదుపరి, న్యామద్దల గ్రామంలోని ఎఫ్పీ షాపును సందర్శించి, అక్కడి నిర్వహణ, సరుకుల నిల్వలు, పంపిణీ విధానం , లబ్ధిదారులకు అందుతున్న సేవలపై సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన సరుకులను నిర్ణీత పరిమాణంలో, సకాలంలో అందించాలని సూచించారు.తదుపరి, తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయంలో జరుగుతున్న రెవెన్యూ కార్యకలాపాలు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల నుంచి స్వీకరించిన వినతుల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, రెవెన్యూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, వేగవంతంగా అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ భూపాల్ రెడ్డి ధర్మవరం, సంబంధిత తహసీల్దార్, రెవెన్యూ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.




# రీసర్వే పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలి

**- జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్..**

**అనంతపురం, సెప్టెంబర్ 02 :అనంత జనశక్తి న్యూస్**

రీసర్వే పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం బెలుగుప్ప మండల కేంద్రంలో రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి 6వ విడత పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని, రీసర్వే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బెలుగుప్ప తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మ్యుటేషన్లు, పిజిఆర్ఎస్ దరఖాస్తులు మరియు దస్త్రాల పరిష్కారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, తహసీల్దార్ అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ గురు బ్రహ్మ, విఆర్ఓలు మరియు విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.





# రీసర్వే పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలి

**చెన్నేకొత్తపల్లి, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**

చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల గ్రామంలో జరుగుతున్న ఫేజ్-V రీసర్వే పనులను శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రౌండ్ ట్రూతింగ్, ఈ-కేవైసీ ప్రక్రియలను తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. సర్వేకు ముందుగా సమాచారం అందిస్తున్నారా, రైతుల సమక్షంలోనే ఈ-కేవైసీ నిర్వహిస్తున్నారా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు.సర్వే నంబర్ 156/3 వద్ద గ్రామ విస్తీర్ణ వివరాలను పరిశీలించగా, రీసర్వేకు ముందు, తర్వాత 16.40 ఎకరాల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. డీఎల్ఆర్ ప్రక్రియను నవంబర్ 15లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో న్యామద్దల గ్రామ వెక్టరైజేషన్ పనులను పరిశీలించారు. ఫేజ్-IIలోని మేడాపురం గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సెప్టెంబర్ 17లోగా జాయింట్ ఎల్పీఎంలను తగ్గించాలని సూచించారు. ఫేజ్-IV కనుముక్కల గ్రామంలో జాయింట్ ఎల్పీఎంలను 2 శాతం మేర తగ్గించేందుకు వీఎస్, వీఆర్వోలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రీసర్వే పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ రామ్ భూపాల్ రెడ్డి, చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ సురేష్ కుమార్, డీఐఓఎస్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ పాల్గొన్నారు.

# ఐవీఆర్ కాల్స్ కి అందరూ స్పందించండి.

**- గోకులం అంగన్వాడి కేంద్రంలో పీపుల్ పాజిటివ్ పర్ఫెక్షన్ మీద అవగాహన.**

**- పుట్టపర్తి సిడిపిఓ ఈ. జయంతి.**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్:**

పుట్టపర్తి ప్రాజెక్ట్ పుట్టపర్తి మండలం గోకులం అంగన్వాడీ కేంద్రంలో పీపుల్ పాజిటివ్ పర్ఫెక్షన్ మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుట్టపర్తి సీడీపీఓ ఈ జయంతి, సూపర్వైజర్ అయ్యగారి రజిత హాజరయ్యారు . సీడీపీఓ ఈ జయంతి మాట్లాడుతూ.... ఐవీఆర్ కాల్స్ కి అందరూ స్పందించాలని అందరూ ఒకటి నొక్కి అంగన్వాడీ కేంద్రం సేవల గురించి తమ అభిప్రాయం చెప్పాలని వివరించారు. అంగన్వాడీ కేంద్రం పరిశుభ్రత మరుగుదొడ్డి నిర్వహణ గురించి పౌష్టికాహారం పంపిణీ మరియు నాణ్యత గురించి ఐవీఆర్ కాల్స్ వచ్చినప్పుడు లబ్ధిదారులు అందరూ ఒకటి నొక్కి తమ స్పందన తెలియజేయాలని ఐసీడీఎస్ కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమం లో గోకులం అంగన్వాడీ కార్యకర్త సులోచన మరియు గోకులం లబ్ధిదారులు పాల్గొన్నారు.



# వాస్మల్ పాయిజన్ తాగి మహిళ మృతి

**రాప్తాడు, సెప్టెంబర్ 2 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు మండలం మరూరు గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన మునిమడుగు లక్ష్మి (37) వాస్మల్ పాయిజన్ తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మికి గత మూడు సంవత్సరాలుగా ఆరోగ్య సమస్యలు ఉండటంతో అనంతపురంలోని ప్రశాంతి మైండ్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆగస్టు 30న ఉదయం ఆమె భర్త ఎం. రాము గొర్రెలు మేపేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు.

అదే రోజు ఉదయం 11 గంటల సమయంలో లక్ష్మి తన సెల్ఫోన్ నుంచి భర్తకు ఫోన్ చేసి ఆరోగ్యం సరిగా లేదని, వాస్మల్ పాయిజన్ తాగినట్లు తెలిపింది. దీంతో వెంటనే ఇంటికి చేరుకున్న భర్త 108 అంబులెన్స్లో ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 2న తెల్లవారుజామున 4.45 గంటలకు లక్ష్మి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**హిందూపురం, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**

దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా హిందూపురం పట్టణంలోని వైఎస్సార్ బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుడ్డంపల్లి వేణు రెడ్డి గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

**రాప్తాడు సెప్టెంబర్ 2 అనంత జనశక్తి న్యూస్**

చే



అప్పుల బాధతో ఓ యువకుడు ఇంట్లో ఫ్యాన్కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాప్తాడు మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. అయ్యవారిపల్లికి చెందిన జనగాని లలిత్కుమార్ (19) ఆటో డ్రైవర్గా పనిచేస్తున్నాడు. అతడు స్నేహితులు, బంధువుల వద్ద సుమారు రూ.5 లక్షలు అప్పు సినట్లు అతని తల్లి జనగాని కవిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైనట్లు తెలిపారు.కవిత తన కుమార్తె శ్రీమంతం కార్యక్రమం కోసం ధర్మవరానికి వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో లలిత్కుమార్ చీరతో ఫ్యాన్కు ఉరివేసుకుని మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# మహానేత వైఎస్సార్ కి ఘన నివాళ్ళులర్పించిన నాయకులు

**యాడికి, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు కలిసి వైఎస్సార్ సర్కిల్ లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి బుధవారం పూలమాల వేసి 17 వర్ధంతి నివాళులమఅర్పించారు. మండల కన్వీనర్ ఎం. సంజీవ రాయుడు , స్టేట్ జాయింట్ సెక్రటరీ వెన్నపూస వెంకటరామిరెడ్డిలు మాట్లాడుతూ పేదల సంక్షేమం, ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పాలించి కోట్లాది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు భోగాతి బ్రహ్మానంద రెడ్డి , నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



# అనంతలో పవన్ ప్రభంజనం..



**- అట్టహాసంగా జనసేనాని జన్మదిన వేడుకలు**

**అనంతపురం, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**

జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అనంతపురం నగరంలో ఘనంగా నిర్వహించారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, అహుడ చైర్మన్ టీసీ వరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు యువత, జనసైనికులు, వీరమహిళలు, పార్టీ అభిమానులు భారీగా తరలివచ్చారు.స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల మీదుగా సాగింది. 'జై పవన్ కళ్యాణ్', 'జై జై జనసేన' నినాదాలతో జిల్లా కేంద్రం మార్మోగింది. అనంతరం అనంత కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన వేడుకల్లో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు అధ్యక్షత వహించారు.టీసీ వరుణ్తో పాటు రాష్ట్ర కార్యక్రమాల కమిటీ ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, రాయలసీమ ప్రాంత మహిళా సమన్వయకర్త పెండ్యాల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులు జయరాం రెడ్డి, అంకె ఈశ్వరయ్య తదితర నాయకులు భారీ కేక్ను కట్ చేసి పవన్ కళ్యాణ్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'జనసేన జై కొట్టు' లోగోను ఆవిష్కరించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో టీసీ వరుణ్ పవన్ కళ్యాణ్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యువజన విభాగం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమానికి హాజరైన పార్టీ శ్రేణులు, అభిమానులకు భోజన వసతి కల్పించారు. వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, నగర, జిల్లా కమిటీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



- జనసైనికులు ఈ సందర్భంగా బైక్ ర్యాలీ, అన్నదాన కార్యక్రమములు

అగళి సెప్టెంబర్ 02,అనంత జనశక్తి న్యూస్:

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, సినీ హీరో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు అగళి మండల కేంద్రంలో జనసైనికులు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా జనసేన నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు అందరూ పెద్ద ఎత్తున కలిసి మండల కేంద్రంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి ఒకరినొకరు స్వీట్లు పంచుకొని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కల్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పవర్ స్టార్‌గా అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు అన్నారు. ఉండే ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లూ వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. పంచాయతీ రాజ్ శాఖలో అనేక సంస్కరణలతో, అభివృద్ధి కార్యక్రమాలతో పెనుమార్పులు తెస్తున్నారు. గిరిజన ప్రజల కష్టాలు తీర్చేలా రోడ్ల నిర్మాణం నుంచి పచ్చదనం పెంపు వరకు ఆయన తీసుకుంటున్న చర్యలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం విషయంలో ప్రజలకు కూటమి ప్రభుత్వానికి ఇచ్చిన మాటను నిజం చేసేలా అనునిత్యం పనిచేస్తున్న పవన్ కల్యాణ్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకునేలా ఆశీర్వదించాలని ఆ దేవదేవుడిని ప్రార్థిస్తున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో మండల అధ్యక్షుడు సి భానుప్రకాష్, మండల ఉపాధ్యక్షుడు ఈరేగౌడ, నాయకులు రమేష్ కుమార్, నియోజకవర్గ సమన్వయకర్త రంగస్వామి, మడకశిర మండలం అధ్యక్షుడు శివాజీ, మరియు జనసేన నాయకులు మధుడి మారుతీ, వెంకటేష్, దివాకర్, ఆటో హరీష్, తదితర జనసైనికులు పాల్గొన్నారు

# సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

యాడికి, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్ :



జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం మండల కన్వీనర్ కోడి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పురవీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మొదట శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో పవన్ కళ్యాణ్ పేరు మీద అర్చన , పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భగవంతుడి ఆశీస్సులతో పవన్ కళ్యాణ్ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజా జీవితంలో మరింత ఉన్నత స్థానాలను చేరుకొని సేవలందించాలన్నారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. తాడిపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు .ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎంత పెద్ద సమస్య అయినా పరిష్కరించగలిగే ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని, పదేళ్ల రాజకీయ ప్రస్థానంలో ఆయన దృష్టికి వచ్చిన దీర్ఘకాలిక సమస్యలను గుర్తు పెట్టుకొని మరి పరిష్కారం చూపుతు ప్రజల మన్ననలు అందుకున్నారని తెలిపారు . ఆయన చేపట్టిన శాఖలన్నీ కూడా నేడు ప్రత్యేక ప్రశంసలు పొందుతున్నాయన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో యాడికి మండలంలో జనసేన జయకేతనం ఎగరవేస్తుందని ఆశించారు .ప్రజలు జనసేన పార్టీకి అండగా నిలబడాలని అభివృద్ధికి మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు జాకీర్ హుస్సేన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ అబ్దుల్ రహీమన్, మధుఆచారి, పప్పు వెంకటేష్ ,నాగభూషణం, దస్తగిరి,సోమరాజేష్,నరేష్, గుండ్ల శివ , మల్లికార్జున జనసైనికులు మహేష్ , రాము ,అల్లా సాయి హుస్సేన్, ఇతరులు పాల్గొన్నారు.

# ధర్మ మార్గంలో కథనాలు ఇవ్వాలి

- ధర్మ విజేత' మాస పత్రిక ఆవిష్కరణ సభలో తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సారధి చైర్పర్సన్ వెన్నెల గద్దర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్రాంత డిజిపి ఆంజనేయ రెడ్డి.

అనంతపురం సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్



సామాజిక, సాంస్కృతిక, మానవీయ విలువలకు ప్రాధాన్యం ఇస్తూ 'ధర్మ విజేత' మాసపత్రిక పునఃప్రారంభమైంది. ఈ నెల నుంచి పత్రిక క్రమం తప్పకుండా ప్రతి నెలా పాఠకులకు అందుబాటులో ఉంటుందని పత్రిక ఎడిటర్ డా. ఉద్దండం చంద్రశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పత్రికలో విద్య, ఆరోగ్యం, కళలు, పర్యావరణం, ఆధ్యాత్మికం, పర్యాటకం, సంస్కృతి, వారసత్వం, మానవ విలువలు, మానవ సంబంధాలు వంటి అంశాలతో పాటు సమకాలీన పరిణామాలపై వార్తా విశేషాలు, ప్రత్యేక కథనాలు, వ్యాసాలు, కథానికలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. చరిత్రలో మరుగునపడిన సంఘటనలను వెలుగులోకి తీసుకువచ్చి, వాటికి సజీవ రూపం ఇవ్వడం కూడా పత్రిక ప్రధాన లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్నారు.అన్నివర్గాల ప్రజలకు చేరువై, సమాజానికి ఉపయోగకరమైన, విలువలతో కూడిన సమాచారాన్ని అందించాలనే లక్ష్యంతో 'ధర్మ విజేత' మాసపత్రికను పునఃప్రారంభిస్తున్నట్లు పత్రిక కరస్పాండెంట్ డా. ఎం. సురేష్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ శ్రీ ఆంజనేయ రెడ్డి మరియు తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డా. వెన్నెల గద్దర్ సంయుక్తంగా 'ధర్మ విజేత' మాసపత్రికను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పత్రిక టెక్నికల్ డైరెక్టర్ శ్రీ షేక్ బాబా, డా. పుచ్చలపల్లి మిత్రతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.విద్య, విజ్ఞానం, సంస్కృతి, చరిత్రతో పాటు సమకాలీన సమాజానికి అవసరమైన అంశాలను సమగ్రంగా ప్రతిబింబిస్తూ 'ధర్మ విజేత' మాసపత్రిక పాఠకులకు ఒక విలువైన వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి శుభాకాంక్షలు



పుట్టపర్తి, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజాసేవలో మరింత ఉన్నతంగా రాణిస్తూ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.జన్మదిన వేడుకలను పురస్కరించుకుని టీడీపీ-జనసేన శ్రేణులు కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, పేదలకు సహాయ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఉపయోగపడే విధంగా వేడుకలను నిర్వహించాలని సూచించారు.కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు సాగుతోందని పేర్కొంటూ, రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పల్లె సింధూర రెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి ఆకాంక్షించారు.

# నేడు ఓటరు జాబితా పై గ్రామసభ



యాడికి, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్ :

మండల కేంద్రంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఓటరు జాబితా పై గ్రామసభ ను నిర్వహిస్తున్నట్లు బుధవారం ఈఓ ప్రమీల తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ ప్రమీల మాట్లాడుతూ యాడికి పంచాయతీ కి సంబంధించిన ఓటరు జాబితా ను కూలాల వారిగా చదివి వినిపిస్తామని , చనిపోయిన వారి వివరాలను తెలియచేస్తామని తెలిపారు. కావున ప్రజలందరూ తప్పకుండా గ్రామ సభకు హాజరు కావాలని కోరారు.

# అనంతపురం జిల్లాకు జాయ్ అలుకాస్



- ఘన స్వాగతం పలికిన పల్లె సింధూర, పల్లె రఘునాథ్ రెడ్డి

అనంతపురం, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్

జాయ్ అలుక్కాస్ జ్యువెలరీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జాయ్ అలుక్కాస్ అనంతపురం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా ఘన స్వాగతం లభించింది. పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకున్న జాయ్ అలుక్కాస్‌కు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, కళాశాల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జాయ్ అలుక్కాస్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం వివిధ అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి నివాసానికి చేరుకున్న జాయ్ అలుక్కాస్, సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి, పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు, జాయ్ అలుక్కాస్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన "మహానేత వైయస్సార్"



- ఘన నివాళులర్పించిన బొంబాయి రమేష్ నాయుడు

యాడికి, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి తెలుగు రాజకీయాల్లో, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన "మహానేత" అని వైకాపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొంబాయి రమేష్‌నాయుడు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్నికి బుధవారం 17వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొంబాయి రమేష్‌నాయుడు, మాజీ ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొంబాయి రమేష్‌నాయుడు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ నాయకుడిగా సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకం,104 , రైతు రుణమాఫీ, ఫీజు రీయింబర్స్మెంట్, వైఎస్సార్ చేయూత, డ్వాక్రా రుణాలు తదితరుల సంక్షేమ పథకాలను అమలు చేసి,చేరగని ముద్ర వేశారని తెలిపారు.వైస్సార్ సేవలు, ఆశయాలు ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు,మాజీ వార్డు మెంబర్ లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మహిళల అభ్యున్నతే సమాజ అభివృద్ధికి పునాది:

- ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

యల్లనూరు సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్



మహిళలు ఆర్థికంగా, సామాజికంగా స్వావలంబన సాధించినప్పుడే కుటుంబంతో పాటు సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అన్నారు. యల్లనూరు మండలం మేడికుర్తి గ్రామంలో మహిళలతో నిర్వహించిన ఆత్మీయ కలయిక కార్యక్రమంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడుతో కలిసి ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగం, రాజకీయాలు, పరిపాలనతో పాటు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. మహిళల సంక్షేమం, భద్రత, గౌరవం, ఆర్థిక సాధికారతకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యత కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 33 శాతం రిజర్వేషన్ కల్పించారని పేర్కొన్నారు.స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను ప్రోత్సహించడంతో పాటు స్వయం ఉపాధి, చిన్నతరహా వ్యాపారాలు, వివిధ జీవనోపాధి కార్యక్రమాల ద్వారా వారు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేసుకోవాలని కోరారు. మహిళల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే ఆత్మీయ కలయిక కార్యక్రమం ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా తెలియజేయాలని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల హామీని నిలబెట్టుకున్న మంత్రి సత్యకుమార్..

- పీసీ రేవుకు శాశ్వత తాగునీటి పరిష్కారం

ముదిగుబ్బ సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పీసీ రేవు గ్రామ ప్రజల దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ శాశ్వత పరిష్కారం చూపారని స్థానిక నాయకులు తెలిపారు. గ్రామంలో నీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధికి మండల పరిషత్ నిధుల నుంచి రూ.6.50 లక్షలు కేటాయించారు.2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా పీసీ రేవు గ్రామాన్ని సందర్శించిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు స్థానికులు తీవ్ర తాగునీటి సమస్యను వివరించారు. సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అందులో భాగంగా నూతన బోరు, మోటారు, పైపులైన్, నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన పనులను పూర్తి చేశారు. ముదిగుబ్బ మండల ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ ఆధ్వర్యంలో స్విచ్ ఆన్ చేసి నీటి సరఫరాను ప్రారంభించారు. దీంతో గ్రామ ప్రజల తాగునీటి కష్టాలు తీరడంతో వారు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్ రెడ్డి, ఎంపీడీవో హజీవ్ అలీ, టీడీపీ మండల కన్వీనర్ ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రసాద్, ప్రత్యేక అధికారి చలపతి, ఓబీసీ మండల అధ్యక్షుడు చంద్రమోహన్, సర్పంచ్ నాగభూషణ, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రామమోహన్, ఓబీసీ కార్యదర్శి నారాయణస్వామి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఘనంగా వైయస్ఆర్ 17వ వర్ధంతి



**తలుపుల సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, పేదల పెన్నిధి, దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా తలుపుల మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బిఎస్ మక్బుల్ మరియు తలపుల మండల కన్వీనర్ డీకే బాబు.ఈ సందర్భంగా వైఎస్సార్ ముఖ్యమంత్రిగా అందించిన సంక్షేమ పాలనను, పేదలు-బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్ సేవలు, స్ఫూర్తి ఎప్పటికీ మరువలేనివి.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు మరియు వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మరపురాని మహానేతకు ఇవే మా... ఘన నివాళులు



**అగళి సెప్టెంబర్ 02,అనంత జనశక్తి న్యూస్:**

అగళి మండల కేంద్రంలోని మండల వైసిపి పార్టీ అధ్యక్షుడు స్టూడియో శ్రీనివాస్ ఆద్వర్యంలో బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి 17వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున కలిసి ఘన నివాళు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు రాజకీయాల్లో, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన "మహానేత" అని పేర్కొన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ నాయకుడిగా సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకం,104 , రైతు రుణమాఫీ, ఫీజు రీయింబర్స్మెంట్, వైఎస్సార్ చేయూత, డ్వాక్రా రుణాలు తదితరుల సంక్షేమ పథకాలను అమలు చేసి,చేరగని ముద్ర వేశారని తెలిపారు. వైస్సార్ సేవలు, ఆశయాలు ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయం అని తెలిపారు.

## ఘనంగా మాజీ ముఖ్యమంత్రి 17వ.వర్ధంతి



**నల్లచెరువు సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు బస్టాండ్ కూడలిలో ఉన్న దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వర్యులు డా..వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి మరియు వైయస్సార్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశరథ రామయ్య నాయుడు వారి వారి గ్రూపుల ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గతంలో రాజశేఖర్ రెడ్డి గారి పరిపాలనలో అతను చేసిన సంక్షేమ పథకాలను, సేవలను గుర్తు చేస్తూ ప్రసంగించారు ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహిళా భద్రత పై పోలీసుల అవగాహన సదస్సు

**తలుపుల సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రం లోని వెలుగు కార్యాలయం నందు మండల సబ్ ఇన్స్పెక్టర్ చెన్నయ్య అధ్యక్షతన మరియు ఫ్రెండ్స్ ట్రస్ట్ ఫౌండర్ మన్సూర్ భాగస్వాములై మహిళా భద్రత,హక్కులు,మహిళలకు ఎదురయ్యే సమస్యలు,వేధింపులు, గృహహింస మరియు సైబర్ వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చెన్నయ్య మాట్లాడుతూ మహిళలు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని,ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం ఎలా పొందాలి, తమకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి ఎలా తీసుకెళ్లాలి అనే విషయాలను వివరించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవడంతో పాటు, చుట్టుపక్కల మహిళలకు కూడా భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్వైజర్ శంకరమ్మ,వెలుగు సిసి గంగాధర, అన్మినేటర్లు,ఆశా వర్కర్లు, ఏఎన్ఎమ్ లు, పోలీస్ సిబ్బంది మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు




## మొక్కలే మానవుడి జీవిత నేస్తాలు..

**- హరితాంధ్రప్రదేశ్ కోసం సమష్టిగా కృషి చేయాలి**

**అమరావతి సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఏపీ గ్రీన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదల నాగబాబు పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, పచ్చటి వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.'వన క్షేమం-జన క్షేమం' కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 20 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు చేపట్టాలని అన్నారు. చిన్నారులకు చిన్న వయసు నుంచే మొక్కలు నాటడం, వాటిని పెంచడం అలవాటు చేయాలని సూచించారు.చిన్నారులతో కలిసి తన మొదటి అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని నాగబాబు తెలిపారు. మొక్కల సంరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకుని సమష్టి కృషితో రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.






## మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి కి ఘన నివాళి

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 02 అనంత జన శక్తి న్యూస్.**

పుట్టపర్తి పరిధి లోని బ్రాహ్మణపల్లె లో వైయస్ ఆర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపు మేరకు పుట్టపర్తి మండల వైసీపీ నాయకులు,కార్యకర్తలు మహానేత కి ఘనంగా నివాళులు అర్పించి,సత్యసాయి సూపర్ హాస్పిటల్ వద్ద బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.యస్.కేశవ రెడ్డి మాట్లాడుతూ. పేదవాడి కన్నీటిని తుడిచి వారి ముఖాల్లో చిరునవ్వులు నింపిన మహానేత వైఎస్సార్ ఒక పేరు కాదు పేదల గుండెల్లో చెరగని నమ్మకం, ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిన స్ఫూర్తి. ఆయన భౌతికంగా దూరమైన ఆయన ఆశయాలు, సేవలు, జ్ఞాపకాలు ప్రజల గుండెల్లో ఎప్పటికీ సజీవమే అని అన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్, రవి నాయక్, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, బాబుల్ రెడ్డి, వైయస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కానూరు అభివృద్ధికి మరిన్ని నిధులు: మంత్రి దుర్గేష్

**నిడదవోలు, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**



విద్యా రంగంలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పెరవలి మండలం కానూరులో జనసేన నాయకుడు కోలా సీతయ్య నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. బీసీ హాస్టల్ విద్యార్థినుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారికి పరుపులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతతో విద్యార్థినులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామని, విద్యార్థులకు ఉచిత యూనిఫారాలు అందిస్తున్నామని తెలిపారు. నిడదవోలులో నెస్లే సంస్థ సహకారంతో బయో టాయిలెట్లు ఏర్పాటు చేశామని చెప్పారు.చంద్రబాబు నాయకత్వంలో, పవన్ కళ్యాణ్ చొరవతో కానూరు గ్రామ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు కేటాయించామని మంత్రి తెలిపారు. రహదారుల పునర్నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్రామీణాభివృద్ధి కోసం 'పల్లె పండుగ' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.కానూరు గ్రామస్తులు అందజేసిన విజ్ఞప్తులపై స్పందించిన మంత్రి, గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేతన్నలకు పెట్టుబడిగా నూలు.. త్వరగా ఆర్థిక సాయం

**- మంత్రి సవిత**

**అమరావతి, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**

చేనేత కార్మికులపై పెట్టుబడి భారం తగ్గించేందుకు నూలును రుణ రూపంలో పెట్టుబడిగా సరఫరా చేయాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు. చేనేతలకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.అమరావతి సచివాలయంలో చేనేత, జౌళి శాఖ, ఖాదీ గ్రామీణ పారిశ్రామికాభివృద్ధి బోర్డు అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 'నేతన్నల సేవలో' పథకానికి వచ్చిన 36,632 దరఖాస్తులను పరిశీలించి 10 రోజుల్లోగా అర్హులను గుర్తించి రెండో విడత ఆర్థిక సాయం త్వరగా అందించాలని ఆదేశించారు. తొలి విడతలో 71,536 మంది నేతన్నలకు రూ.25 వేల చొప్పున సాయం అందించినట్లు తెలిపారు.చేనేత ఉత్పత్తులను ఆప్కో అధికారులు కొనుగోలు చేసిన అనంతరం సరఫరా చేసిన నూలు విలువను మినహాయించి మిగిలిన మొత్తాన్ని నేతన్నలకు చెల్లించాలని సూచించారు. నూలు ముందుగానే అందించడం వల్ల నేతన్నలకు పెట్టుబడి సమస్య తగ్గుతుందని చెప్పారు. ఆప్కో, లేపాక్షి విక్రయ కేంద్రాల్లో చేనేత, హస్తకళా ఉత్పత్తుల అమ్మకాలు పెంచాలని, పండగల సందర్భంగా రాయితీ విక్రయాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 6న పెనుకొండలో ఆప్కో విక్రయ కేంద్రం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, భోగాపురం విమానాశ్రయంలోనూ ఆప్కో, లేపాక్షి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఖాదీ గ్రామీణ పారిశ్రామికాభివృద్ధి బోర్డు ద్వారా అందించే స్వయం ఉపాధి యూనిట్లపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రి సవిత ఆదేశించారు. చేనేత, హస్తకళాకారులకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.సమీక్షలో శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖారాణి, ఖాదీ గ్రామీణ పారిశ్రామికాభివృద్ధి బోర్డు సీఈవో సింహాచలం, లేపాక్షి ఎండీ విశ్వ పాల్గొన్నారు.



## వైయస్సార్ సంక్షేమానికి అభివృద్ధికి ఆద్యుడు – మెట్టు విశ్వనాథ్



**రాయదుర్గం, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్ :**

దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ సంక్షేమానికి, అభివృద్ధికి సారధిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మెట్టు విశ్వనాథరెడ్డి కొనియాడారు. బుధవారం వెయస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పలు వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, వైయస్సార్ అమర్ రహే, జోహార్ వైయస్ఆర్ అంటూ నినాదాలు చేస్తూ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలయజ్ఞం, ఫీజు రియంబర్స్మెంట్, ఇందిరమ్మ ఇళ్లు,ఆరోగ్యశ్రీ, 108, 104,లాంటి ఎన్నో పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచారన్నారు. వైయస్సార్ ఆశయాలు కొనసాగిస్తూ జగన్మోహన్ రెడ్డిని మరొక్కసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రతిన భూనారు. వైయస్సార్ సంయుక్త రాష్ట్ర కార్యదర్శి ఉషారాణి మాట్లాడుతూ వైయస్సార్ అంటే పేద ప్రజల గుండె చప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయన ఇప్పటికీ సజీవంగా ఉన్నాడు. రాయదుర్గం పట్టణానికి సురక్షిత మంచినీటి పథకాన్ని అందించిన మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గౌని ఉపేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మేకల శ్రీనివాసుల యాదవ్, రాయదుర్గం మండల్ కన్వీనర్ గొల్ల రామాంజనేయులు, కనేకల్ మండల కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పోరాల్ల గోవిందరాజులు, శారదమ్మ, సోషల్ మీడియా కన్వీనర్ రవీంద్రారెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులు కేడీమీ ప్రశాంత్, యువజన విభాగ అధ్యక్షులు మహిధర్, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజా

**యాడికి, సెప్టెంబర్ 2,అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలోని బుగ్గరోడ్డు లో ఉన్నశ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజా కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ అయ్యప్పస్వామి కి విశేష అభిషేకం చేసి, వివిధ పూల మాలలతో అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.అయ్యప్పస్వామి పాటలతోను, ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప అనే నామం మారుమ్రోగింది.అయ్యప్పస్వామి కి మహా మంగళహారతి ని సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను , అందచేశారు. పడి పూజ కార్యక్రమం ను , భక్తులకు భిక్ష ను దాత అరుణ, కుటుంబం సభ్యులు ఏర్పాటు చేశారు.దాత అరుణ, కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని అయ్యప్పస్వామి ని వేడుకొన్నారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరినాథ్ స్వామి, చిట్టి స్వామి, ఆలయ అధ్యక్షుడు నాగరాజు, పూజారి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.



## అక్రమంగా ఇసుక, మట్టి పై కొరడా.

**- ఇసుక వాహనాలపై రెవెన్యూ అధికారులు దాడి.**

**- తాసిల్దార్ దేవరాజ్**

**ధర్మవరం సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణం, ఇతర గ్రామాలలో అక్రమంగా ఇసుక తో పాటు మట్టి రవాణా చేస్తున్న వాహనాలపై రెవెన్యూ అధికారులు బృందం దాడి చేయడం జరిగిందని తాసిల్దార్ దేవరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం టీం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో ఏడు ట్రాక్టర్లు ఒక టిప్పర్ను గుర్తించి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తవ్వకాలు లేదా రవాణాకు పాల్పడిన వారిపై ప్రభుత్వ నిబంధనలు ప్రకారం జరిమాణాలు విధించి కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ టీం తో పాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



## డోర్ టు డోర్ కార్యక్రమం

**ఆమడగూరు సెప్టెంబర్ 2 అనంత జనశక్తి న్యూస్**

అమడగూరు,మండల పరిధిలోని తుమ్మల పంచాయతీ టి పుట్ల వాండ్లపల్లి గ్రామంలో బుధవారం నాడు డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా తుమ్మల గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆర్ఎంపీ డాక్టర్ శ్రీనివాసులు మండల సీనియర్ నాయకులు పి పెద్ద హనుమంత రెడ్డి బూత్ కన్వీనర్ రమణ నాయక్ అలాగే తెలుగుదేశం కార్యకర్తలు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొనడం జరిగింది



# మంచి చేసే కూటమిని ఆదరించాలి..

- ముంచేసే గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర నుంచి తరిమికొట్టాలి
- ఎన్నికల సమయం లో పుష్కర, పట్టిసీమ పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయి
- గోదావరి ఎడమ కాలువ ప్రారంభ సభలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**అనకాపల్లి సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**



గోదావరి జలాలు నేడు ఉత్తరాంధ్రను తాకుతున్నాయంటే అపర భగీరథుడు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దార్శనికతే అని నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా రాష్ట్ర నీటి వనరుల శాఖకు సంబంధించి.. పోలవరం ఎడమ కాలువ ప్రారంభం ఒక సువర్ణాధ్యాయంగా మంత్రి రామానాయుడు అభివర్ణించారు. 2014లో గౌర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకొస్తానని ఇచ్చిన హామీని ఆయన నిలబెట్టుకున్నారన్నారు.

పోలవరం ప్రాజెక్టు ప్రారంభానికి ముందే గోదావరి జలాలను అటు కృష్ణా డెల్టాకు, ఇటు ఉత్తరాంధ్రకు తీసుకువస్తానని.. మాట ఇచ్చి నిలబెట్టుకున్న మహనీయుడు చంద్రబాబు నాయుడు అని ఆయన పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టా దాహార్తిని తీర్చారు. పుష్కర ద్వారా ఉత్తరాంధ్రకు గోదారమ్మని తీసుకొచ్చారు.. ఇది ఆయన ముందుచూపుకు, దార్శనికతకు నిదర్శనం అన్నారు. ఇదే తరుణంలో గొడ్డలి పార్టీ అధినేత నాడు ప్రతిపక్ష హోదాలో.. పట్టిసీమ వట్టిసీమని, పుష్కర పనికిరానిదని ఎద్దేవా చేశారు. అంతటితో ఆగకుండా తాను అధికారంలోకి వస్తే ఈ రెండిటినీ పీకేస్తానని అన్నారు. సూపర్ ఎల్ నినో ఉపద్రవ సమయంలో ఈ రెండు పథకాలు.. ఎంతగా ఉపకరించాయో మీ అందరూ తెలుసుకోవాలన్నారు.

ఐదు ప్రధాన నదులను, 9 చోట్ల జాతీయ రహదారులను, కుమ్మరిలోవ తదితర ప్రాంతాలలో 100 మీటర్ల లోతున తవ్వకాలు జరిపి కాలువ ముందుకు తీసుకురావడం వంటి ఎన్నో క్లిష్టమైన పనులను చేయడం వెనుక ఎంతో శ్రమ ఉందని రామానాయుడు చెప్పారు.

ఇదే తరుణంలో.. ఐదేళ్ల అధికారంలో ఉన్న గొడ్డలి పార్టీ ఎడమ కాలువకు సంబంధించి తట్ట మట్టి తీయలేదు.. బస్తా సిమెంట్ వెయ్యలేదు.. ఇలాంటి ముంచేసే గొడ్డలి పార్టీ అవసరమా.. మీకోసం అహర్నిశలు కష్టపడుతూ.. మీ భవిష్యత్తు తరాలకు.. బంగారు బాటలు వేసే మంచి చేసే కూటమి అవసరమా ఆలోచించాలి అని రామానాయుడు.. పిలుపునిచ్చారు.

సూపర్ ఎల్ నినో.. వర్షాభావ పరిస్థితుల్లో కూడా.. 900 టిఎంసిల గోదావరి వరద నీరు బంగాళాఖాతంలో కలిసిపోయిందని రామానాయుడు ఆవేదన చెందారు. గొడ్డలి పార్టీ హయాంలో పోలవరం విధ్వంసం కాకుండా ఉండుంటే.. కుడికాలువకు 17,500 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 17500 క్యూసెక్కులు వెరసి 350 టీఎంసీల నీటితో సమృద్ధిగా మన పంటలు పండేవన్నారు. ఐదేళ్ల అమూల్య సమయం.. వృధా చేయడమే కాకుండా.. ఉత్తరాంధ్రకు.. గొడ్డలి పార్టీ తీవ్ర ద్రోహం చేసిందని రామానాయుడు విమర్శించారు.. అటువంటి గొడ్డలి పార్టీని ఉత్తరాంధ్ర నుంచి తరిమి తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# అనంతగిరిలో ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి వేడుకలు

**అనంతగిరి, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**



అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండల కేంద్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు తడబారికి మిత్తుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి తడబారికి మిత్తుల, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మిత్తుల మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమలు చేసిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని అన్నారు. పేదలు, రైతులు, విద్యార్థుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శెట్టి నీలవేణి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దూరు గంగన్న దొర, మండల పరిశీలకుడు ఎస్. సన్యాసిరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, పాంగి అప్పారావు, పాడి కృష్ణమూర్తి, డానియల్, బాదం నాగేశ్వరరావు, ఎస్. నవీన్, బోర్రా ఎస్. లక్ష్మణరావు, సీనియర్ నాయకులు గుజ్జల మధుసూదన్, కే. సింహాద్రి, మాజీ సర్పంచులు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# భారీ లారీలతో వేంగడ రోడ్డు గోతులమయం.. చర్యలు తీసుకోవాలని డిమాండ్

**అనంతగిరి, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం వేంగడ పంచాయతీ పరిధిలో వేంగడ నుంచి జంబువలస వరకు ఉన్న సుమారు 4 కిలోమీటర్ల తారు రోడ్డు గోతులమయంగా మారింది. హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ పరిధిలో జరుగుతున్న రోడ్డు పనులకు అవసరమైన నిర్మాణ సామగ్రిని భారీ లారీల ద్వారా ఈ రోడ్డుపై తరలిస్తుండటంతో రోడ్డు దెబ్బతింటోందని స్థానికులు తెలిపారు.భారీ వాహనాల రాకపోకలతో పలుచోట్ల తారు రోడ్డు బద్దలై గోతులు ఏర్పడ్డాయని వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు తెలిపారు. రోడ్డు పరిస్థితిని అనంతగిరి పంచాయతీరాజ్ జేఈ గణేష్ దృష్టికి తీసుకెళ్లామని, రెండు యూనిట్ల లారీలను మాత్రమే నడిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా భారీ లారీల రాకపోకలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఇలాగే కొనసాగితే రోడ్డు పూర్తిగా దెబ్బతిని అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు కూడా గ్రామాలకు చేరుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తుపాను కారణంగా దెబ్బతిన్న రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు జరగలేదని తెలిపారు.అధికారులు తక్షణమే స్పందించి భారీ లారీల రాకపోకలను నియంత్రించాలని, ఇప్పటికే ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేపట్టి రోడ్డును పరిరక్షించాలని కొండలరావు కోరారు.



# ఎస్కేయూలో ముగ్గుల పోటీలకు స్పందన



**అనంతపురం సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ప్రాంగణం లో సెప్టెంబర్ 4వ తేదీన జరుగు శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద విద్యార్థినిల తో ముగ్గుల పోటీలు నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రమణ యాదవ్ హైకోర్టు న్యాయవాది.పోతుల రాధాకృష్ణ యాదవ్, బి. సి. ఉద్యమాల నాయకులు, ఉపాధ్యాయులు. యూనివర్సిటీ బి. సి.ఉద్యోగ సంఘం అధ్యక్షులు మల్కారి ఆలూరు లక్ష్మణ రావు,జైపాల్ యాదవ్ బి. సి.విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. ఇతర శ్రీకృష్ణ జయంతి కమిటీ సభ్యులు పాల్గొని అమ్మాయిలు వేసిన ముగ్గులలో ఉత్తమ ముగ్గులు వేసిన వారికి బహుమతులను 4వ తేదీన రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి , స్థానిక శాసన సభ్యులు పరిటాల సునీత చేతుల మీద అందించడం జరుగును అని కమిటీ చైర్మన్ జైపాల్ యాదవ్ తెలిపారు

# పంచాయతీలను సందర్శించిన స్వర్ణ వార్డు అధికారి

**యాడికి, సెప్టెంబర్ 2, అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని రాయల చెరువు గ్రామంలో ఉన్న పంచాయతీ కార్యాలయం ను, యాడికి లో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం జిల్లా స్వర్ణ గ్రామం , స్వర్ణ వార్డు అధికారి నర్సా రెడ్డి, మండల స్వర్ణ గ్రామ అధికారి కాంతమ్మ లు సందర్శించారు. ఈ సందర్భంగా రాయలచెరువు లో పంచాయతీ కార్యాలయం లో స్వర్ణ గ్రామ సిబ్బంది తో సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్వర్ణ గ్రామం , స్వర్ణ వార్డు అధికారి నర్సా రెడ్డి, మండల స్వర్ణ గ్రామ అధికారి కాంతమ్మ లు మాట్లాడుతూ ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని , ఎటువంటి అనధికార వసూలు చేయకూడదని సిబ్బంది తెలిపారు. అందరూ కార్యాలయాల ఇన్ టైం అవుట్ టైం పాటించాలని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి అరుణ్ కుమార్, ఈఓ ప్రమీల, స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.




# 'జై కొట్టు' వీడియో వైరల్!

**అమరావతి, సెప్టెంబర్ 02, అనంతజనశక్తి న్యూస్**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ కార్యక్రమాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. జనసేన పార్టీ యువజన విభాగానికి 'జై కొట్టు' అనే పేరు పెట్టి.. లోగోను ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆహార అండ్ పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్ నాదెండ్ల మనోహర్ 'జై కొట్టు' లోగోతో పాటు గేయాన్ని కూడా ఆవిష్కరించారు. యువజన విభాగం ఆవిష్కరణ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. పార్టీ యువజన విభాగం ద్వారా యువతను మరింతగా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, వారికి బాధ్యతలు అప్పగించడం లక్ష్యంగా ఈ కొత్త విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జనసేన యువజన విభాగం నేపథ్య గీతంకు ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ థమన్ మ్యూజిక్ అందించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అయింది. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత రెండు, మూడు నెలలుగా పవన్ కొన్ని ఆరోగ్య సమస్యల కారణంగా పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేకపోతున్నారన్నారు. అయినప్పటికీ పవన్ ఎక్కడ ఉన్నా ప్రజల గురించి ఆలోచిస్తూనే ఉంటారన్నారు. పార్టీకి, రాష్ట్ర ప్రజలకు తన వంతు సేవ అందించాలనే ఆలోచనతో పవన్ ఎప్పుడూ ముందుంటారని మంత్రి నాదెండ్ల అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలను ప్రస్తావించిన నాదెండ్ల.. అప్పటి ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు జనసేన పార్టీ కూటమితో కలిసి కీలకంగా పనిచేసిందని చెప్పారు. గత ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఎదుర్కొని.. కూటమి విజయానికి జనసేన శ్రేణులు కృషి చేశాయని పేర్కొన్నారు. పార్టీ యువజన విభాగం 'జై కొట్టు' ఆవిష్కరణతో జనసేనలో యువతకు మరింత ప్రాధాన్యం లభించే అవకాశం ఉంది. పార్టీ కార్యకలాపాల్లో యువతను చురుకుగా భాగస్వాములను చేయడంతో పాటు భవిష్యత్‌లో వారికి నాయకత్వ అవకాశాలు కల్పించే దిశగా ఈ విభాగం ఉపయోగపడుతుందని జనసేన వర్గాలు భావిస్తున్నాయి. పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా 'జై కొట్టు' యువజన విభాగం ఆవిష్కరణ జరగడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. పిఠాపురంలో జరిగిన ఈ కార్యక్రమంకు అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# వైసీపీది విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

గొడ్డలి పార్టీ హయాంలో ఎక్కడచూసినా అరాచకాలేనని సీఎం చంద్రబాబు అన్నారు. ఉత్తరంధ్ర ప్రాజెక్ట్‌లకు రూ.500 కోట్లు కూడా ఖర్చు చేయలేదు.. కానీ ఆ నాయకుడి విలాసాలకు రుషికొండపై రూ.500 కోట్లతో భవనం కట్టారని ధ్వజమెత్తారు. మూడు రాజధానులు అంటూ మాయమాటలు చెప్పారని ఆగ్రహించారు. ఇప్పుడు మావిగన్ అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. విధ్వంసమే వైసీపీ విధానమని ఎద్దేవా చేశారు. గొడ్డలి పార్టీ అన్నింట్లోనూ క్రెడిట్ చోరీకి యత్నిస్తోందని ధ్వజమెత్తారు. తాము పోలవరం పూర్తిచేస్తే.. తామే కట్టామంటారేమో? అని వ్యంగ్యంగా మాట్లాడారు. అమరావతి నిర్మాణం పూర్తయితే.. తమ ఘనతే అంటారేమో? అని ఎద్దేవా చేశారు. వైసీపీ ఫేక్ రాజకీయం అలాగే ఉంటుందని సీఎం చంద్రబాబు సెటైర్లు గుప్పించారు.

**ఉత్తరాంధ్రకు గోదారమ్మ.. జలహారతి**

ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఉత్తరాంధ్ర వాసుల కల సాకారం అయింది. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర ప్రాంతానికి చేరుకున్నాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పీఎల్ పురం వద్ద సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రెగ్యులేటర్ ఆన్ చేసి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేశారు. తొలుత సీఎం చంద్రబాబు పోలవరం ఎడమ ప్రధాన కాలువ శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ కాలువ వద్దకు చేరుకున్నారు. అక్కడ గోదారమ్మకు సీఎం జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనిత, అచ్చెన్నాయుడు, ఎంపీ సి.ఎం.రమేశ్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా దిగవంత నేత,డాక్టర్, వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి




**అమడగూరు,సెప్టెంబర్, 2 ( అనంత జనశక్తి న్యూస్ )**

అమడగూరు మండల కేంద్రంలోని బస్టాండ్ నందు వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ తనకంటి జయప్ప ఆధ్వర్యంలో డాక్టర్.వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి 17వ వర్ధంతి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కన్వీనర్.జయప్ప మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి మరపురాని మహానేత,దేశ రాజకీయాలను మార్చిన,అపర భగీరథుడు, రైతు బాంధవుడు,ఆరోగ్యశ్రీ ప్రధాత,విద్యా ప్రదాత,హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును,ఆంధ్రప్రదేశ్ జల నాడి పోలవరం ప్రాజెక్టును ప్రారంభించి,ప్రజహితనికి అంకితభావంతో తన ప్రాణాలను అర్పించి,ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయిందని,ఆయన ఆశీస్సులు మనపై ఉండాలని ,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.ఈ కార్యక్రమంలో , మాజీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శేషురెడ్డి, మాజీ సర్పంచ్ సురేంద్ర రెడ్డి శ్రీధర్ రెడ్డి, రంగారెడ్డి,ఆదినారాయణ,ఎంపిటిసి లు సురేంద్ర రెడ్డి, నాగరాజు,నారాయణ,మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నక్కల.చిన్నప్ప, మహమ్మదబాద్ సొసైటీ మాజీ చైర్మెన్ బొట్టు. స్వామి.ఆంజనేయులు,, టౌన్ కన్వీనర్ సుధాకర్ ఎస్ బాబు సోహెల్ కేశవ వెంకటరెడ్డి, యస్.పాల్,నారాయణ స్వామి,మురళి,నవీన్ ఖాజాపూర్ వెంకట శివ గడ్డం నరసింహులు ఆది రెడ్డప్ప,మొబైల్ సూరి, మణికంఠ రాజు నరేష్,శివ,పక్కిర్ రెడ్డి,దామోదర్ రెడ్డి,సీనియర్ నాయకులు, వైఎస్ఆర్సిపి.కార్యకర్తలు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా డిప్యూటీ సిఎం జన్మదిన వేడుకలు




**నల్లచెరువు సెప్టెంబర్ 02 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు బస్టాండ్ లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి వర్యులు, పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మండల జనసేన పార్టీ యువ నాయకుడు రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి బాణసంసాలు పేల్చి సంబరాలు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు మండల నాయకులు జన సైనికులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# గిరి గ్రామంలో ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు




- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పవన్ కళ్యాణ్ పాలన
- అనంతగిరి జనసేన నేత గుజ్జెల మంగళ

**అనంతగిరి, అనంత జన శక్తి న్యూస్, సెప్టెంబర్ 2:**

అనంతగిరి మండలంలోని కొండిబ పంచాయతీ గిరి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమానికి అనంతగిరి మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జెల మంగళ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలు, అభిమానులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గుజ్జెల మంగళ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఉప ముఖ్యమంత్రిగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రగతికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు జయ కుమార్, సింహాద్రి, జ్యోతి, కియావతి, బాబురావు, దీపరాజు, బాబూజీ, శివ కార్తిక్, ధనవతి, శివ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్యతో మూలియగూడ గ్రామం

- ఆరు నెలలుగా పనిచేయని సోలార్ మోటారు.. అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**అనంతగిరి, సెప్టెంబర్ 2:అనంత జనశక్తి న్యూస్**



అనంతగిరి మండలంలోని టోకూరు పంచాయతీ పరిధిలోని మూలియగూడ గ్రామం తీవ్ర మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. గ్రామంలోని కింది వీధి ప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్ మోటారు గత ఆరు నెలలుగా పనిచేయకపోవడంతో తాగునీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనంతగిరి జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుజ్జెల మంగళ తెలిపారు.సోలార్ మోటారు పనిచేయకపోవడంతో కనీసం తాగడానికి కూడా నీరు అందక గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. సమస్యపై స్థానిక పంచాయతీ కార్యదర్శికి పూర్తిగా సమాచారం ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.వేసవితో పాటు ప్రస్తుతం కూడా మంచినీటి సమస్య కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి పనిచేయని సోలార్ మోటారును మరమ్మతు చేసి, గ్రామానికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గుజ్జెల మంగళ డిమాండ్ చేశారు. ప్రజల కనీస అవసరమైన తాగునీటి విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఎక్కడా బోర్ కొట్టదు

‘స్వతహాగా నాకు కామెడీ సినిమాలంటే చాలా ఇష్టం. బాగుందంటే మళ్లీ మళ్లీ చూస్తుంటా. అలా చూడాలనిపించే సినిమానే ‘రోమాంచకం’. యువతరం, కుటుంబ ప్రేక్షకులు కలిసి హాయిగా ఆస్వాదించేలా ఉంటుంది” అన్నారు ప్రణయ్‌రెడ్డి వంగా. ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సోదరుడైన ఈయన నిర్మించిన సినిమానే ‘రోమాంచకం’. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్‌కుమార్ జంటగా నటించారు. వేణుగోపాల్ రెడ్డి దర్శకుడు. ఈ నెల 3న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది.

ఈ సందర్భంగా ప్రణయ్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటిస్తూ... “ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఓ యువకుడి చుట్టూ తిరిగే కథ ఇది. పాత్ర ప్రధానమైన ఈ కథలో కడుపుబ్బా నవ్వించే హాస్యం కీలకం. కళాశాల నుంచి బయటికొచ్చిన ఆ యువకుడు ఏం చేశాడు? అతని జీవితంలో ఏం జరిగింది? ప్రేమకథ ఎలా సాగింది? స్నేహితులు ఎంత గందరగోళానికి గురయ్యారనే అంశాలు మంచి వినోదాన్ని పంచుతాయి. ఎక్కడా బోర్ కొట్టకుండా 2గంటల 20 నిమిషాలు సరదా సరదాగా సాగుతుంది. ఇప్పుడు మా అందరి దృష్టి ‘స్పిరిట్’పైనే ఉంది. అది పూర్తయ్యాకే మా సంస్థలో చేయనున్న కొత్త సినిమాల గురించి ఆలోచిస్తాం. మంచి కథలు వస్తే తప్పకుండా పరిమిత వ్యయంతో కూడిన సినిమాల్ని నిర్మిస్తాం. వచ్చే ఏడాదికి ‘అర్జున్ రెడ్డి’ విడుదలై పదేళ్లు అవుతుంది. ఆ సందర్భంగా కొన్ని కొత్త సన్నివేశాల్ని జోడించి మళ్లీ విడుదల చేయాలనే



ప్రణాళికతో ఉన్నాం. ‘స్పిరిట్’ సినిమా 40 శాతం పూర్తయింది” అన్నారు.

# ‘చకోర..’ పాట ఆవిష్కరణ

శ్రవణ్, మలైకా టి.వాసుపల్ జంటగా నటిస్తున్న చిత్రం ‘చకోర - లూనార్ లవ్‌బర్డ్’. మంగా శ్రీనివాస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. చింతాడ హేమారావు నిర్మాత. అక్టోబరు 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులోని ‘అద్దంలా చేయనా చిట్టి గుండెని... అందంగా దాచేయంగ జాబిలమ్మని, అరచేత నింపనా చిన్ని ప్రేమని...’ అంటూ సాగే గీతాన్ని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఇటీవల విడుదల చేశారు. హెన్రీ స్వరకల్పనలోని ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం సమకూర్చగా, సాయిచరణ్ భాస్కరుని ఆలపించారు. ప్రేమికుడి హృదయంలోని భావాల్ని అందంగా ఆవిష్కరించిన ఈ గీతానికి మంచి స్పందన లభిస్తోందని సినీ వర్గాలు చెప్పాయి.

# నటి మమితా బైజుకు అస్వస్థత..

నటి మమితా బైజు అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరంతో ఆమె ఆసుపత్రిలో చేరారు. సెప్టెంబర్ 5న ఆస్ట్రేలియాలో జరగనున్న ‘క్లైడ్ ఓనం 2026’ వేడుకలకు మమితా బైజు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అనారోగ్యం కారణంగా ఈ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. ఈ విషయాన్ని క్లైడ్ మలయాళీ అసోసియేషన్ వెల్లడించింది. ఓనం వేడుకలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అసోసియేషన్ ఓ వీడియో పంచుకుంది. అందులో మమిత మాట్లాడుతూ.. వైద్యుల సలహా మేరకు ప్రయాణం చేయలేకపోతున్నందుకు క్షమాపణలు చెప్పారు . త్వరలోనే అభిమానులను కలుసుకుంటానని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇక మమిత వరుస విజయాలతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆమె నటించిన మూడు చిత్రాలు నెల రోజుల వ్యవధిలోనే విడుదలై ఘన విజయాన్ని అందుకున్నాయి. ప్రస్తుతం ఆమె నటించిన మలయాళ చిత్రం ‘బెత్లెహోమ్ కుటుంబ యూనిట్’ తెలుగు విడుదలకు సిద్ధంగా ఉంది. సెప్టెంబర్ 4న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.



# జబర్దస్త్‌లో మళ్లీ పాత జోష్.. వారి ఎంట్రీతో రష్మీ ఎమోషనల్!



బుల్లితెరపై ఎన్నో ఏళ్లుగా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్న కామెడీ షో ‘జబర్దస్త్’. ఒకప్పుడు స్టార్ కమెడియన్లతో కళకళలాడిన ఈ షో.. ప్రస్తుతం మళ్లీ తన పూర్వ వైభవాన్ని సొంతం చేసుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా గతంలో జబర్దస్త్‌కు వెన్నెముకగా నిలిచిన పలువురు కమెడియన్లను తిరిగి షోలోకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే మెగా బ్రదర్ నాగబాబు జబర్దస్త్‌లోకి జడ్జిగా రీ ఎంట్రీ ఇచ్చారు. ఆయన రాకతో షోకు మళ్లీ పాత కళ వచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కమెడియన్ల మధ్య పోటీ పెంచేందుకు నాగబాబు కూడా ప్రత్యేక ఆఫర్లు, ఛాలెంజ్‌లు ప్రకటిస్తూ షోపై ఆసక్తిని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే గతంలో జబర్దస్త్‌లో తమ కామెడీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పలువురు కమెడియన్లు తిరిగి ఎంట్రీ ఇస్తున్నారు. ఇప్పటికే హైపర్ ఆది, ధనాధన్ ధన్‌రాజ్, చలాకీ చంటి, సద్దాం, వినోద్ అలియాస్ వినోదిని తదితరులు జబర్దస్త్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చారు. తమదైన పంచ్‌లు, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలోకి మరో ఇద్దరు క్రేజీ కమెడియన్లు చేరారు. ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉన్న సుడిగాలి సుధీర్, గెటప్ శ్రీను కూడా చాలా రోజుల తర్వాత జబర్దస్త్ వేదికపై కనిపించారు. ఈ ఇద్దరూ కలిసి కనిపించడంతో షో అభిమానుల్లో ఒక్కసారిగా పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయి. ‘కామెడీ కింగ్స్ ఈజ్ బ్యాక్’ అంటూ మేకర్స్ విడుదల చేసిన తాజా ప్రోమో సోషల్ మీడియాలో ఆసక్తిని పెంచుతోంది. ఎప్పటిలాగే సుడిగాలి సుధీర్, గెటప్ శ్రీను తమదైన కామెడీ పంచ్‌లు, ప్రాసలతో ప్రేక్షకులను నవ్వించారు. యాంకర్ రష్మీతో కలిసి వీరిద్దరూ చేసిన కామెడీ కూడా ప్రోమోలో హైలైట్‌గా నిలిచింది.

# అందుకే కోహ్లీ-అనుష్క లండన్‌లో స్థిరపడ్డారు..!



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తన కుటుంబంతో కలిసి కొన్నాళ్లుగా లండన్‌లో నివాసం ఉంటున్న సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా మ్యాచ్‌లు ఉన్నప్పుడు, ఐపీఎల్ సీజన్ సమయంలో మాత్రమే అతడు భారత్‌కు వస్తున్నాడు. దీంతో కోహ్లీ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్‌కు గురయ్యాడు. అయితే, విరాట్ భారత్‌ను వీడి లండన్‌లో నివసించడానికి గల కారణాన్ని బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్ భర్త డా.శ్రీరామ్ నేనే తాజాగా బయటపెట్టారు. లండన్‌కు వెళ్లడానికి ముందు అనుష్క శర్మతో జరిపిన ఆసక్తికర సంభాషణను డా. శ్రీరామ్ యూట్యూబర్ రణవీర్ అల్లాబాడి యాతో జరిగిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. తమకున్న స్టార్‌డమ్ కారణంగా భారత్‌లో కోహ్లీ-అనుష్క సాధారణ జీవితాన్ని గడపలేకపోతున్నారని, అందుకే లండన్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారని తెలిపారు.

పబ్లిక్ అటెన్షన్‌కు దూరంగా ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కోహ్లీ దంపతులు తమ పిల్లలు వామికా, అకాయ్‌లను మీడియా దృష్టికి దూరంగా ఉంచి సాధారణంగా పెంచాలనుకుంటున్నారని తెలిపారు. మరోవైపు, టెస్టులు, టీ20లకు గుడ్ బై చెప్పిన కోహ్లీ.. వన్డే మ్యాచ్‌లు, ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో భారత్‌కు వస్తున్నాడు. ఇక, 2018లో విడుదలైన ‘జీరో’ చిత్రం తర్వాత అనుష్క శర్మ నటనకు దాదాపు దూరంగా ఉన్నారు. ఆ తర్వాత ఆమె ‘చక్దా ఎక్స్‌ప్రెస్’లో నటించారు. ఇందులో అనుష్క మాజీ భారత క్రికెటర్ ఝులన్ గోస్వామి పాత్రను పోషించారు. అయితే, ఈ సినిమా ఇంకా విడుదల కాలేదు. ఆమె 2022లో తన నిర్మాణ సంస్థ ‘క్లీన్ స్లేట్ ఫిల్మ్స్’ బాధ్యతల నుంచి వైదొలిగి కుటుంబ బాధ్యతలు చూసుకుంటోంది.

# మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం.. మ్యాచ్‌లు ఎప్పుడంటే?




ఐసీసీ మొట్టమొదటిసారిగా నిర్వహించనున్న మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ కి భారత్ ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. మ్యాచ్‌లు క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (ముంబయి), వడోదర అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతాయి. కటాఫ్ డేట్ అయిన జులై 6 నాటికి మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో తొలి ఆరు స్థానాల్లో ఉన్న జట్లు ఇందులో పోటీపడనున్నాయి. ఈ లెక్కన ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక టోర్నమెంట్‌కు అర్హత సాధించాయి. ప్రస్తుతం ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్న పాకిస్థాన్ ఈ టోర్నమెంట్‌కు దూరమైంది. టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతి జట్టు మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. టాప్-2లో నిలిచిన టీమ్‌లు ఫిబ్రవరి 28న జరిగే ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

వాస్తవానికి, ఈ టోర్నీ శ్రీలంకలో జరగాల్సి ఉండగా.. శ్రీలంక క్రికెట్ బోర్డు పరిపాలన వ్యవహారాల్లో ఆ దేశ ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందన్న కారణంగా ఆతిథ్య హక్కులను కోల్పోయింది. టోర్నమెంట్ నిర్వహణకు బంగ్లాదేశ్, భారత్, దక్షిణాఫ్రికాలను ఆప్షన్లుగా పెట్టుకున్న ఐసీసీ చివరకు ప్రత్యామ్నాయ ఆతిథ్య దేశంగా భారత్‌ను సిఫార్సు చేసింది. ఈ నిర్ణయాన్ని సెప్టెంబర్ 2న ఐసీసీ బోర్డు ఆమోదించింది.

# ఫీల్డింగ్ కోచ్ కోసం లింక్డ్ఇన్‌లో పాక్ పోస్టు.. సోషల్ మీడియాలో ట్రోలింగ్




పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మరోసారి వార్తల్లో నిలిచింది. లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ చేతిలో ఘోర పరాజయం తర్వాత ప్రధాన కోచ్ సర్ఫ రాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను తొలగించి, ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపిన మరుసటి రోజే పీసీబీ మళ్లీ వార్తల్లోకెక్కింది. మొన్నటివరకు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్న షేన్ మెక్‌డెర్మాట్ పదవీకాలం జులైలో ముగిసింది. ప్రస్తుతం ఆ పదవి ఖాళీగా ఉంది. ఫీల్డింగ్ కోచ్ పదవిని భర్తీ చేయడానికి పాకిస్థాన్ దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే, ఇందులో వింతేముంది అంటారా.. ఆగండి అసలు ట్విస్ట్ ఇక్కడే ఉంది మరి. కోచ్ నియమకానికి పీసీబీ ఏకంగా లింక్డ్ఇన్‌లో ఓపెన్ హైరింగ్ మొదలు పెట్టింది. పాకిస్థాన్ బోర్డు ఎంచుకున్న ఈ విధానాన్ని సోషల్ మీడియాలో నెటిజన్లు తెగ ట్రోల్ చేస్తున్నారు. తమదైన శైలిలో విమర్శలు, సెటైర్లతో ఆటాడుకుంటున్నారు. “నాకు ఆశ్చర్యంగా ఉంది! పీసీబీలో ఉద్యోగాల భర్తీ పూర్తిగా ప్రతిభ ఆధారంగానే జరుగుతోందా? ఇక్కడ సిఫార్సులు, పలుకుబడి ఏమీ పనిచేయవా?” అని ఓ యూజర్ వ్యంగ్యంగా స్పందించాడు. “దీన్ని ఇక్కడ ఎందుకు పోస్ట్ చేస్తున్నారు?ఆ పని కోసం నేరుగా ఏదైనా రిటైర్డ్ మిలిటరీ లేదా ఆర్మీ సిబ్బందిని సంప్రదించండి” అని మరో యూజర్ సెటైర్ వేశాడు. “దీనికి దరఖాస్తు చేద్దామని అనుకుంటున్నాను. గత 13 ఏళ్లుగా నేను ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగంలో పనిచేశాను. ఏం జరుగుతుందో చూద్దాం” అని మరో నెటిజన్ కామెంట్ చేశాడు. “ఈ పదవి గురించి ఆసక్తిగా ఉంది.. మొన్న రెండు క్యాచ్‌లు డ్రాప్ చేశా” అని మరో యూజర్ వ్యంగ్యంగా అన్నాడు.

# పాక్ క్రికెటర్ ‘ఫేక్ ఇంజూరీ’పై విచారణ!

ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు సమయంలో గాయం కారణమని చెప్పి పాక్ క్రికెటర్ ఇమామ్ ఉల్ హక్ బ్యాటింగ్‌కు దిగలేదు. కండరాలు పట్టేశాయని చెప్పి.. రెండు ఇన్నిగ్స్‌ల్లోనూ డగౌట్‌కే పరిమితమయ్యాడు. దీంతో అతడి గాయంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. పాకిస్థాన్ మాజీ చీఫ్ సెలక్టర్ మహ్మద్ వాసిమ్ కూడా ఇమామ్ గాయాలపై విమర్శలు చేశాడు. గతంలోనూ ఇమామ్ ఇలానే వ్యవహరించాడంటూ ఆరోపించాడు. ఈ క్రమంలోనే పాకిస్థాన్ సెలక్షన్ కమిటీ సభ్యుడు ఆకిబ్ జావెద్ కీలక ప్రకటన చేశారు. ఇమామ్ గాయంపై విచారణ చేపడతామని వెల్లడించారు. “విచారణ చేయబోతున్నాం. కండరాలు పట్టేయడంతో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అతడు బ్యాటింగ్‌కు రాలేదు. ఇది సాధ్యమా? లేకపోతే ఇందులో ఏమైనా మతలబు ఉందా? అనేది దర్యాప్తు చేస్తాం. గాయాలు కావడం ఆటగాళ్లకు సహజమే. గతంలో పలువురు చేతికి లేదా కాలుకు గాయమైనా సరే కట్లు కట్టుకొని మైదానంలోకి దిగిన సందర్భాలనూ చూశాం. కానీ, ఇప్పుడు ఇమామ్ అంశంలో పరిస్థితి భిన్నమైంది. తప్పకుండా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం” అని జావెద్ వెల్లడించారు. ఈ క్రమంలో ఇమామ్ కూడా న్యాయ సలహా కోసం ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు రెండు టెస్టుల్లోనూ ఓడిపోవడంతో పాకిస్థాన్ ఏడుగురిపై వేటు వేసింది. అందులో ఇమామ్ కూడా ఉండటం గమనార్హం.

మరోవైపు ఇమామ్ తనకు నిజంగానే గాయమైనట్లు తెలియజేయాలనే ఉద్దేశంతో షార్ట్ ధరించి పట్టీలు వేసుకొని మరీ వార్మప్ చేస్తూ కెమెరాల్లో కనిపించాడు. దీనిపై ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ స్టువర్ట్ బ్రాడ్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. నిజంగా గాయమైతే ఇలాంటి డ్రామాలు చేయనక్కర్లేదన్నాడు.

**బాబర్‌కు తీవ్ర జ్వరం?**

దారుణమైన ఆటతీరుతో ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. ఆ జట్టు కెప్టెన్ బాబర్ అజామ్ హై ఫీవర్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఈ నెల 9న జరిగే మూడో టెస్టులో ఆడతాడా? లేదా? అనేది అనుమానంగా మారింది. అయితే, అతడు కోలుకొని ఫిట్‌నెస్ సాధిస్తాడనే నమ్మకం ఉందని పీసీబీ వర్గాలు పేర్కొన్నాయి.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314